వీలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 28 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఆగష్టు 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-




## నేడు భారత్‌కు రానున్న శుభాన్షు శుక్లా

- రేపు ప్రధాని మోడీతో భేటీ

న్యూఢిలీ
:భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా స్వదేశానికి బయల్దేరారు. నేడు భారత్‌లో ల్యాండ్ కానున్నారు. సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని శుభాన్షు కలిసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. కాగా, ఆక్సియం-4 మిషన్ ద్వారా శుభాన్షు ఇటీవలే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి వచ్చిన విషయం

-మిగతా 3 లో





# హై అలెర్ట్

**భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తం కండి**

- వాగులు వంకలు పొంగే ప్రమాదం ఉంది
- కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారం సేకరించాలి
- సహాయ బృందాలతో సమన్వయం చేసుకోవాలి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్, -ప్రజా స్వేచ్ఛ
భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం.. జగిత్యాల మినహా 15 జిల్లాల్లో అధిక వర్షపాతం, మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని సీఎం తెలిపారు. నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు

-మిగతా 3 లో



## నేటినుంచి బీహార్‌లో ఓట్ అధికార్ యాత్ర

- సెప్టెంబర్ 1 వరకు బీహార్ అంతటా రాహుల్ పర్యటన
- లాపతా ఓట్ అంటూ రాహుల్ పోస్ట్
- నిమిషం నిడివితో ఎక్స్‌లో వీడియో

న్యూఢిల్లీ/పాట్నా,
ఓట్ చోరీకి పాల్పడుతోందంటూ ఎన్నికల కమిషన్‌పై వరుస విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ మరోసారి ఓట్ల చౌర్యంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హాస్యం, వ్యంగ్యం మేళవించిన స్పూఫ్ వీడియోను శనివారంనాడు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎన్నికల సంఘం బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు

-మిగతా 3 లో



## ఆంక్షలపై పునరాలోచిస్తున్న ట్రంప్..

- భారత్‌పై సుంకాల భారం తగ్గనుందా..!

న్యూఢిల్లీ,-
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌కు ఊరట కలిగే నిర్ణయం తీసుకునే ఆలోచనలో ఉన్నారు. అలస్కాలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తో సమావేశం తర్వాత ట్రంప్ మాట్లాడుతూ ఆదేశపు వ్యాపార భాగస్వాములపై మరోమారు ఆంక్షలు విధించడానికి తొందర పడడం లేదని వెల్లడించారు. భారత్‌పై విధించిన సుంకాల భారంపై మరో రెండు మూడు వారాల్లో పునరాలోచిస్తానని ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో ట్రంప్ తెలిపారు.'రష్యాతో చమురు కొంటున్న దేశాలపై విధించిన సుంకాలపై, ఆంక్షలపై పునరాలోచిస్తాను. వచ్చే రెండు మూడు వారాల్లో ఈ విషయంపై

-మిగత3 లో

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి




- సమీక్షా సమావేశంలో మంత్రులు పొన్నం, తుమ్మల

హైదరాబాద్, -ప్రజా స్వేచ్ఛ
జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని, అందుకు తగిన విధంగా పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అభ్యర్థి ముఖ్యం కాదని, అది పార్టీ చూసుకుంటుందని అన్నారు. మనమంతా ఐక్యంగా పోరాడి

-మిగతా 3 లో

## రజనీకాంత్ స్టైలే వేరు

- నేటి తరంలోనూ రజనీకి అభిమానులు
- అభినందనలు తెలిపిన పవన్ కళ్యాణ్



అమరావతి,
అగ్ర కథానాయకుడు రజనీకాంత్ సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏపీ డిప్యూటీ- సీఎం పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు చెప్పారు. నటుడిగా స్వర్ణోత్సవ సంబరాలు చేసుకుంటున్న రజనీకాంత్ మరిన్ని విభిన్న పాత్రలతో సినీ ప్రియులను మెప్పించాలని ఆకాంక్షించారు. వెండితెరపై 'సూపర్ స్టార్ రజని' అని -టైటిల్ కనిపించగానే థియేటర్లు ఏ విధంగా మార్మోగుతాయో పలుమార్లు చెన్నైలో చూశా. తరాలు మారుతున్నా సినీ ప్రియుల్లో ఆ ఆనందోత్సాహాల వన్నె తగ్గలేదు. ఆ స్థాయి అభిమానులను దక్కించుకున్న కథానాయకుడు రజనీకాంత్.

-మిగతా 3 లో

# పోలవరంను కూలవరం అనగలరా?



- అక్కడో నీతి..ఇక్కడో నీతా
- కాళేశ్వరంను ఎందుకు రిపేర్ చేయరు
- బీజేపీ, కాంగ్రెస్‌ల తీరుపై మండిపడ్డ కేటీఆర్

హైదరాబాద్,-ప్రజా స్వేచ్ఛ
కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా? అని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పలు ప్రశ్నలు సంధించారు. ఎన్నికల వేళ అనుమానాస్పదంగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లపై విమర్శలు చేస్తున్నారు. 24 గంటల్లో భాజపా నేతలు ఎన్డీఎస్ఏను దించి భారత రాష్ట్ర సమితిపై బురదజల్లారు. కొట్టుకుపోయిన పోలవరం కాఫర్ డ్యామ్‌పై భాజపా నేతలు మౌనంగా ఉన్నారు. పోలవరం

-మిగతా 3 లో




## రాహుల్ విమర్శలకు స్పందించనున్న ఈసీ

- ఓట్ల చోరీ ఆరోపణల వేళ.. ఆదివారం సమావేశం
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించే ఛాన్స్

న్యూఢిల్లీ,
రాహుల్ విమర్శలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధం అవుతోంది. కర్ణాటక, బిహార్ సహా దేశంలో అనేక చోట్ల ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా విపక్ష నేతలు ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విమర్శలకు చెక్ పెట్టేందుకు ఈసీ సిద్ధమైనట్లు- తెలుస్తోంది. ఓట్ల చోరీ ఆరోపణల వేళ.. ఆదివారం సమావేశం నిర్వహించనున్నట్లు- సమాచారం. బిహార్‌లో రాహుల్ గాంధీ 'ఓటు- అధికార యాత్ర'ను ప్రారంభించనున్న రోజే ఈ సమావేశం

-మిగతా 3 లో



## వర్ష నష్టాలు జరగకుండా చూడండి

- కల్వర్టుల, కాజ్‌వేల వద్ద అప్రమత్తం
- ఆర్ అండ్ బి అధికారులకు సూచన
- అధికారులతో సమీక్షించిన మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్,-ప్రజా స్వేచ్ఛ
తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆర్అండ్‌బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. అధిక వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, వంతెనల వివరాలపై ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. వరద ప్రవాహాలకు రాష్ట్ర వ్యాప్తంగా 454 చోట్ల ఆర్ అండ్ బీ రోడ్లు దెబ్బతిన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. 629 కిలో మీటర్లు రోడ్డు దెబ్బతిన్నట్లు- అధికారులు నివేదిక ఇచ్చినట్లు- చెప్పారు. రోడ్ల మరమ్మత్తులపై పనులు ప్రారంభించినట్లు- పేర్కొన్నారు. గత ప్రభుత్వం వేసిన నాణ్యతా రహిత రోడ్ల వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పాడ్డాయని ఆరోపించారు. భారీ వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రోడ్ల డ్యామేజీపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..భారీ వర్షాల కారణంగా 22 చోట్ల రోడ్లు తెగిపోతే వెంటనే 4 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేసినట్లు-

-మిగతా 3 లో

# కాళేశ్వరం..మేడిగడ్డను కూల్చే కుట్రలు

- కేసు నమోదయినా ఎందుకు పురోగతి లేదు
- సీబీఐ విచారణ జరిపిస్తే నిజాలు వెల్లడవుతాయి
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్



హైదరాబాద్, -ప్రజా స్వేచ్ఛ
కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపయోగంగా పెట్టిందని బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. కావాలనే అక్కడ రిపేర్లు చేయకుండా, నీటిని ఎత్తిపోయకుండా పడావుపెట్టారని అన్నారు. మేడిగడ్డ ఆనకట్ట వద్ద శబ్దాలు వినిపించాయని ఏఈఈ రవికాంత్ ఫిర్యాదు చేశారని, అక్టోబర్ 2023, 21న సాయంత్రం 6.30 గంటలకు మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైందని గుర్తు చేశారు. అసాంఘిక శక్తులు ఉన్నాయని ఏఈఈ ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు- చెప్పారు. అయినప్పటికీ.. ఈ కేసు విచారణపై ఎలాంటి

-మిగతా 3 లో

# పుతిన్‌పై నుంచి దూసుకెళ్లిన బీ-2 బాంబర్లు..

### భేటీ వేళ సైనిక సత్తా ప్రదర్శించిన ట్రంప్



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**
ప్రపంచం దృష్టిని ఆకర్షించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖ, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ భేటీ ముగిసింది. అలస్కా వేదికగా జరిగిన ఈ సమావేశం ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే దిశగా ఉంటుందని అంతా భావించారు. అయితే, ఎలాంటి ఒప్పందం లేకుండానే ఇద్దరి మధ్య చర్చలు ముగిశాయి. ఇక పుతిన్‌తో భేటీ వేళ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన సైనిక సత్తాను ప్రదర్శించారు.ఈ భేటీకి ముందు అలాస్కాలోని జాయింట్ బేస్ ఎల్మెండార్ఫ్-రిచర్డ్‌సన్ సైనిక స్థావరానికి తొలుత ట్రంప్ చేరుకున్నారు. ఆ తర్వాత కాసేపటి పుతిన్ అక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా పుతిన్‌కు ట్రంప్ ఆత్మీయంగా స్వాగతం పలికారు. అయితే, పుతిన్‌ను చిరునవ్వుతో పలకరించిన ట్రంప్.. అదే సందర్భంలో తన 'పవర్ ప్లే' చూపించారు. ట్రంప్, పుతిన్ పోడియం వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా.. వారిపైనుంచి బీ-2 బాంబర్లు దూసుకెళ్లాయి. అంతేకాదు, వీరు వెళ్తున్న మార్గంలో యుద్ధ విమానాలను వరుసగా పార్క్ చేసి ఉంచారు. ఇది చూసి పుతిన్ ఒక్కసారిగా అవాక్కయ్యారు.ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోలను చూసిన నెటిజన్లు, పలువురు ప్రముఖులు పుతిన్‌కు ట్రంప్ అమెరికా సైనిక సత్తాను పరోక్షంగా చూపించారు అంటూ మాట్లాడుకుంటున్నారు. కాగా, ఇటీవలే ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం సందర్భంగా టెహ్రాన్ అణు స్థావరాలను ధ్వంసం చేసేందుకు అమెరికా ఈ బీ-2 బాంబర్లను ఉపయోగించిన విషయం సంగతి తెలిసిందే.

# భారత్‌లో చైనా విదేశాంగ మంత్రి మూడు రోజుల పర్యటన



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**
చైనా విదేశాంగ శాఖా మంత్రి వాంగ్‌యి ఆగస్టు 18 నుండి 20 వరకు భారత్‌లో పర్యటిస్తారని ఆ దేశ విదేశాంగ శాఖ ప్రతినిధి శనివారం వెల్లడించారు. చైనా, భారత్ సరిహద్దు సమస్యపై ప్రతినిధులతో వాంగ్‌యి 24వ రౌండ్ చర్చలు జరపనున్నారు. కాగా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఆహ్వానం మేరకు చైనా విదేశాంగ శాఖా మంత్రి వాంగ్ యి భారత్‌ను సందర్శించనున్నారు. ఈ పర్యటనలో భారత్ -చైనా సరిహద్దు ప్రశ్నలపై 24వ రౌండ్ ప్రత్యేక ప్రతినిధుల (ఎస్ఆర్) చర్చలను వాంగ్ యి దోవల్‌తో నిర్వహిస్తారని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికారిక ప్రకటన తెలిపింది. ఈ పర్యటనలో వాంగ్‌యి భారత విదేశాంగ శాఖా మంత్రి ఎస్. జై శంకర్‌తో ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై కూడా చర్చించనున్నట్లు ఆ ప్రకటన పేర్కొంది. 2020లో సరిహద్దులో భారత, చైనా దళాల మధ్య జరిగిన ఘర్షణ తర్వాత ఇరు దేశాధినేతలు చర్చించుకోవడం ఇది రెండోసారి. ఇదిలా ఉండగా.. మరోవైపు ఈ నెల చివరలో భారత ప్రధాని నరేంద్రమోడీ చైనాలో పర్యటించనున్నారు.

# పాకిస్థాన్‌లో మెరుపు వరదలు..

### 48 గంటల్లో 321 మంది మృతి..



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**
దాయాది దేశం పాకిస్థాన్ ను భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. గత రెండు రోజులుగా పాక్ వ్యాప్తంగా కుంభవృష్టి కురుస్తోంది. ఈ వర్షానికి మెరుపు వరదలు సంభవించాయి. నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లు, ఇళ్లను వరద ముంచెత్తింది. భారీ వర్షానికి పలు చోట్ల ఇళ్లు, చెట్లు కూలిపోయాయి. కుండపోత వర్షాల కారణంగా అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. రోడ్లు కొట్టుకుపోయాయి.ఈ కుంభవృష్టి కారణంగా రెండు రోజుల్లోనే దాదాపు 300 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర పాకిస్థాన్‌లో భారీ వర్షాలకు సంభవించిన ఆకస్మిక వరదలకు గత 48 గంటల్లో కనీసం 321 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు శనివారం తెలిపారు. అత్యధికంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ లోనే 307 మంది మరణించినట్లు ప్రావిన్షియల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ తెలిపింది. వంద మందికిపైగా గాయపడ్డారు. అనేక మంది వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు. గల్లంతైన వారి కోసం రెస్క్యూ టీమ్స్ గాలింపు చేపడుతోంది. వరదలకు సంబంధించిన షాకింగ్ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు రానున్న రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పాక్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ హెచ్చరికలతో అప్రమత్తమైన అధికారులు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

# రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అదే ఉత్తమ మార్గం



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**
రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే తన 'ట్రూత్ సోషల్ వేదికగా ఆయన కీలక ప్రకటన చేశారు. ఆ రెండు దేశాలు నేరుగా శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకోవడమే యుద్ధాన్ని ముగించేందుకు ఉత్తమమార్గంగా పేర్కొన్నారు. కాల్పుల విరమణ నిలబడే అవకాశాలు తక్కువేనని చెప్పారు.అదేవిధంగా జెలెన్‌స్కీ అమెరికా పర్యటనను ట్రంప్ ధ్రువీకరించారు. పుతిన్‌తో తాజా చర్చల విషయాన్ని ప్రస్తావించారు. 'అలాస్కాలో ఇదొక గొప్ప, విజయవంతమైన రోజు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం చాలాబాగా జరిగింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, నాటో సెక్రెటరీ జనరల్ ఇతర ఐరోపా నేతలతో ఫోన్‌లో వేర్వేరుగా మాట్లాడాను. నేరుగా శాంతి ఒప్పందానికి వెళ్లడమే యుద్ధాన్ని ముగించేందుకు ఉత్తమ మార్గంగా ఓ నిర్ణయానికి వచ్చాం. కాల్పుల విరమణ తరచూ ఉల్లంఘనలకు గురయ్యే అవకాశం ఉంది. జెలెన్‌స్కీ సోమవారం ఓవల్ కార్యాలయానికి రానున్నారు. అన్ని సవ్యంగా సాగితే పుతిన్‌తో సమావేశాన్ని షెడ్యూల్ చేస్తాం. తద్వారా లక్షలాది మంది ప్రజల ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుంది' అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత ట్రంప్, పుతిన్ మధ్య జరిగిన ఈ సమావేశాన్ని ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనించాయి. భేటీలో అనేక అంశాలు చర్చకు వచ్చాయని ట్రంప్ తెలిపారు. ఈ చర్చల్లో ఎంతో పురోగతి ఉందన్నారు. అయితే కొన్ని సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉందని తెలిపారు. తుది ఒప్పందం మాత్రం కుదరలేదన్నారు. అన్ని విషయాలను పరిష్కరించుకొని అధికారికంగా అగ్రిమెంట్‌పై సంతకం చేసేవరకు ఒప్పందం జరగదన్నారు.

# ముంబైలో భారీ వర్షం..

### కొండచరియలు విరిగిపడి ఇద్దరు మృతి

**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**
మహారాష్ట్ర ముంబై ని భారీ వర్షం అతలాకుతలం చేసింది. శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నగరం మొత్తం స్తంభించిపోయింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.భారీ వర్షానికి ముంబైలోని విక్రోలి లో వర్ష నగర్ ప్రాంతంలోని జన్కళ్యాన్ సొసైటీలో శనివారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడ్డాయి. భారీగా మట్టి, రాళ్లు ఓ గుడిసెపై పడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. తెల్లవారుజామున 2:39 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న



ముంబై అగ్నిమాపక దళం, స్థానిక పోలీసులు, రెస్క్యూ బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఇక భారీ వర్షానికి సియోన్, కుర్లా, చెంబూర్, అంధేరి సహా నగరం మొత్తం జలమయమైంది. సియోన్‌లోని కొన్ని ప్రాంతాల్లో మోకాలి లోతులో నీరు నిలిచిపోయింది. వెస్ట్రన్ ఎక్స్‌ప్రెస్ హైవేపై వాహనాలు నిలిచిపోయాయి. భారీగా వర్షపు నీరు చేరడంతో అంధేరి సబ్‌వేని అధికారులు మూసివేశారు. విక్రోలిలో 21 గంటల్లో 248.5 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలకు ముంబై ఎయిర్‌పోర్ట్‌లో విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. పలు విమానాలు ఆలస్యం కాగా, మరికొన్నింటిని దారి మళ్లిస్తున్నారు. మరోవైపు భారత వాతావణ శాఖ ముంబై నగరానికి అలర్ట్ జారీ చేసింది. పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ మేరకు ముంబై, రాయ్‌గఢ్‌లకు రెడ్ అలర్ట్ ఇచ్చింది.


# బీజేపీ ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక నేడే!



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**
ఉప రాష్ట్రపతి పదవికి జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఎంపిక ఆదివారం జరిగే అవకాశం ఉంది. నేడు జరిగే ఆ పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో అభ్యర్థిని ఎంపిక చేసి, అభ్యర్థి పేరును సోమవారం ప్రకటించే అవకాశం కనిపిస్తున్నది. ఈ రేసులో కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, గుజరాత్ గవర్నర్ దేవవ్రత్ ఆచార్య ముందు వరుసలో ఉన్నట్లు సమాచారం ఢిల్లీ ఎల్‌జీ వీకే సక్సేనా, బీహార్ గవర్నర్ అరిఫ్ మహమ్మద్ ఖాన్, ఆరెస్సెస్ నేత శేషాద్రి చారి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. 19న ఎన్డీయే కూటమి పార్టీల సమావేశంలో బీజేపీ అభ్యర్థికి మిగతా పార్టీలు ఆమోదం తెలుపుతాయి.

# నేలను తాకిన విమానం తోక..

### ముంబై విమానాశ్రయంలో ఎగురుతుండగా ఘటన



**ముంబై -ప్రజా స్వేచ్ఛ**
ఇండిగో ఎయిర్‌బస్ ఏ321 విమానం శనివారం తక్కువ ఎత్తులో గాల్లో ఎగురుతుండగా దాని తోక రన్‌వేని తాకింది. ముంబై విమానాశ్రయంలో వాతావరణం అనుకూలించకపోవడంతో పైలట్లు ఈ విమానాన్ని కిందికి దించకుండా, తక్కువ ఎత్తులో నడిపారు. ఈ సందర్భంగా ఈ ఘటన జరిగింది. కాసేపటి తర్వాత వారు విమానాన్ని సురక్షితంగా దించారు.పైల ట్లు ఇలాంటి వాతావరణం ఉన్నప్పుడు ఇలా చేయడం సాధారణమేనని తెలుస్తున్నది.ఈ విమానానికి అవసరమైన తనిఖీలు, చేసిన తర్వాత కార్యకలాపాలను పునరుద్ధరిస్తామని ఇండిగో తెలిపింది.

# ఏడాదికి 117 గంటలు ట్రాఫిక్‌లోనే.

### బెంగళూరు వాసుల దుస్థితి



**బెంగళూరు -ప్రజా స్వేచ్ఛ**
కర్ణాటకలోని బెంగళూరు అంటే అందరికీ టక్కున గుర్తుకు వచ్చేది ఆ నగరంలో పడే ట్రాఫిక్ బాధలు. బెంగళూరు నగర వాసులు ట్రాఫిక్ జామ్‌ల్లో ఇరుక్కోవడం వల్ల వారి జీవితంలో ఏడాదికి 117 గంటలు హరించుకుపోతున్నాయి. వారు తమ జీవిత కాలంలో అన్ని గంటలు వృథాగా నగరంలోని రోడ్లపైనే ఉండాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది.నగరంలో 1.2 కోట్ల వాహనాలు ఉండటం వల్ల ప్రజల బాధలు అన్నీ ఇన్నీ కావని బీజేపీ ఎంఎల్‌సీ సీటీ రవి ఇటీవల పేర్కొనగా, నగరంలోని ట్రాఫిక్ పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రస్తావించారు. 1.2 కోట్లే కాదు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే 40 లక్షల వాహనాలు కూడా ప్రజల ట్రాఫిక్ తలనొప్పికి కారణమవుతున్నాయని డీకే పేర్కొన్నారు.

# కోర్టులో బియ్యం చల్లినందుకు..

### వైద్యుడికి జైలు.. జరిమానా



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**
ఢిల్లీలోని ఓ కోర్టులో న్యాయ విచారణ జరుగుతున్న సమయంలో ఓ వ్యక్తి వ్యవహరించిన తీరు అందరినీ ఆగ్రహానికి గురి చేసింది. న్యాయ విచారణ అధికారి, న్యాయవాదులు సహా పలువురు హాజరైన కోర్టు గదిలో నేలపై బియ్యం వెదజల్లడంతో.. కోర్టు కార్యకలాపాలు అరగంటపాటు నిలిచిపోయాయి. ఆగస్టు 11న చోటుచేసుకున్న ఈ ఘటనలో అడిషనల్ సెషన్స్ జడ్జి షెఫాలీ బర్నాలా, మరుసటి రోజు కోర్టు తలుపులు తెరిచే వరకు అతడికి జైలు నిర్బంధాన్ని, రూ.2 వేల జరిమానాను విధించారు. ఆ వ్యక్తి ఏదో చేతబడి చేశాడంటూ న్యాయవాదులు అనుమానం వ్యక్తం చేశారు. న్యాయవిచారణ పట్ల అగౌరవంగా వ్యవహరించిన నిందితుడు డాక్టర్ చందర్ విభాస్‌పై జడ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడికి నోటీస్‌లు పంపారు. తన చర్యలపై నిందితుడు కోర్టుకు క్షమాపణలు తెలిపాడు.

# నేటినుంచి బీహార్‌లో ఓట్ అధికార్ యాత్ర

(మొదటి తరువాయి)

వ్యతిరేకంగా, ప్రజల ఓటు- హక్కుపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆదివారం 'ఓటు- అధికార్ యాత్ర'ను చేపట్టనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత అఖిలేష్ ప్రసాద్ సింగ్ తెలిపారు. ఆయన శనివారం పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. బీహార్‌లో ఓటు- అధికార్ యాత్రను ససారం నుంచి రాహుల్ గాంధీ ప్రారంభించనున్నారు. ఈ యాత్ర బహుశా సెప్టెంబర్ 1న ముగియనుంది. ఈ యాత్ర ముగిసేవరకు రాహుల్ రాష్ట్రంలోనే ఉండనున్నారు. ఈ యాత్ర కోసం ముందుగానే అనుమతులు తీసుకున్నాము. ఈ యాత్ర రాష్ట్రంలోని 25 జిల్లాలను కవర్ చేస్తుంది. ఆగస్టు 20, 25, 31 తేదీల్లో యాత్రకు విరామం. సెప్టెంబర్ 1 పాట్నాలో జరిగే ర్యాలీతో ఈ యాత్ర ముగుస్తుంది. ఈ యాత్రలో బీహార్ అసెంబ్లీ ప్రతిపక్షనేత తేజస్వియాదవ్ పాల్గొంటారు. ఆర్‌జెడితోపాటు- ఇండియా బ్లాక్‌లోని ఇతర పార్టీలైన వామపక్ష పార్టీల నేతలు కూడా పాల్గొనున్నారని ఆయన అన్నారు. బిహార్ ఓటర్ల జాబితాలో లోపాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా 'లాపతా ఓటు-' అనే -టైటిల్‌తో వీడియోను ఎక్స్‌లో శనివారం విడుదల చేశారు. నిమిషం నిడివి ఉన్న ఆ వీడియోలో.. పోలీసు స్టేషన్‌లో ఓ వ్యక్తి తన ఓటు- చోరీ చేశారని, ఇంకా లక్షల ఓట్లు- చోరీ అయ్యాయని అధికారులకు ఫిర్యాదు చేస్తారు. పోలీసు సిబ్బంది చెక్ చేసి అందులో తమ ఓట్లు- కూడా గల్లంతుకావడంతో నిర్ఘాంతపోతారు. అలా ఆ వీడియా ముగుస్తుంది. దీనిని రాహుల్ తన అధికారిక ఎక్స్‌లో పోస్టు చేస్తూ.. ఓటర్లందరూ చైతన్యంతో ఓ ఉద్యమంలా ముందుకు సాగాలి. మీ ఓటు- చోరీ అయితే మీ ప్రాథమిక హక్కు చోరీ అయినట్లే అని పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా మనమందరం ఉద్యమంగా పోరాడి మన హక్కులను కాపాడుకుందామన్నారు. ఓట్ల చోరీ అనేది 'డూ ఆర్ డై' సమస్యగా కాంగ్రెస్ పేర్కొంది. ఓట్లు- గల్లంతైన వారి కోసం ఓ వెబ్ పోర్టల్‌ను కూడా ప్రారంభించింది. అందులో పోల్ ప్యానెల్ నుంచి ఓట్ల గల్లంతుకు వ్యతిరేకంగా నమోదు చేసుకోవడానికి, అధికారుల నుంచి జవాబుదారీతనం కోరడానికి, డిజిటల్ ఓటరు జాబితాల డిమాండ్‌కు మద్దతు తెలియజేయడానికి ఆ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించింది.

### నేడు భారత్‌కు రానున్న
# శుభాన్షు శుక్లా

(మొదటి తరువాయి)

తెలిసిందే. ఐఎస్ఎస్ యాత్ర తర్వాత ఆయన తొలిసారి భారత్‌కు వస్తున్నారు. విమానంలో చిరునవ్వులు చిందిస్తూ దిగిన ఫొటోను శుభాన్షు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. స్నేహితులు, కుటుంబ సభ్యులను కలిసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు- తన పోస్టులో రాసుకొచ్చారు. ఆగస్టు 23న జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్నట్లు- పేర్కొన్నాయి. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా శుక్లా బృందం ఈ ఏడాది జూన్‌లో ఐఎస్-ఎస్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ మిషన్‌కు శుక్లా చీఫ్ పైలట్‌గా వ్యవహరించారు. ఐఎస్ఎస్‌లో 18 రోజుల పాటూ గడిపిన ఆయన 60కిపైగా శాస్త్రీయ పరిశోధనల్లో పాల్గొన్నారు. శుభాన్షు బృందం జులై 15న క్షేమంగా భూమికి తిరిగి వచ్చింది. ఇక అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారత వ్యోమగామిగా శుభాన్షు శుక్లా రికార్డు క్రియేట్ చేశారు. 1984లో సోవియట్ యూనియన్‌కు చెందిన ఇంటర్‌కాస్మోస్ మిషన్ కింద సూయజ్ టీ--11 వ్యోమనౌకలో భారత వ్యోమగామి రాకేశ్‌శర్మ తొలిసారిగా అంతరిక్షంలోకి వెళ్లి ఎనిమిది రోజులపాటు- ఉండి తిరిగి వచ్చారు. తాజా ప్రయోగంతో 41 ఏండ్ల తర్వాత రోదసిలోకి వెళ్లి వచ్చిన రెండో భారతీయుడిగా శుభాన్షు రికార్డు సృష్టించారు. ఐఎస్ఎస్‌లోకి వెళ్లి వచ్చిన తొలి భారతీయుడు కూడా ఇతనే కావడం విశేషం.

# ఆంక్షలపై పునరాలోచిస్తున్న ట్రంప్..

(మొదటి తరువాయి)

చర్చిస్తాను. అయితే.. ఈ అంశంపై త్వరగా ఆలోచించాలని అనుకోవడం లేదు. ఇప్పుడు రష్యా వ్యాపార భాగస్వాములపై రెండో దఫా ఆంక్షలు విధిస్తే వాళ్లు తట్టుకోలేరు' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇదే ఇంటర్వ్యూలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం ఫలవంతంగా సాగిందని పేర్కొన్న ట్రంప్ .. తమ మీటింగ్‌కు పదికి పది రేటింగ్ ఇచ్చారు. 50 శాతం సుంకాలు రష్యా నుంచి చమురు కొనేదేశాల్లో ఒకటైన భారత్‌పై 25 శాతం సుంకాలు ప్రకటించిన ట్రంప్.. వాటిని మరో 25 శాతానికి పెంచారు. ఫలితంగా రష్యా నుంచి ఇండియా దిగుమతి చేసుకునే చమురు, ఇతర వస్తువులకు చెల్లించాల్సిన సుంకం యాభైకి చేరింది. అంతేకాదు తన మాటల్ని పెడచెవిన పెట్టి రష్యాతో వ్యాపారం కొనసాగిస్తే.. రెండో దఫా ఆంక్షలు ఉంటాయని ట్రంప్ హెచ్చరించారు. అయితే.. అలస్కా సమావేశంతో అమెరికా అధినేత కాసింత దూకుడు తగ్గించారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని శాంతి ఒప్పందంతో ముగించాలని అనుకుంటున్న ఆయన.. ఆంక్షలపై కూడా వెనక్కి తగ్గేలా కనిపిస్తున్నారు. కానీ.. ట్రంప్ నిర్ణయం ప్రకటించేంత వరకూ నమ్మడానికి వీల్లేదు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

(మొదటి తరువాయి)

కాంగ్రెస్ సత్తా చాటాలని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ బూత్ ఇన్‌ఛార్జ్‌లు, ముఖ్య నేతలతో మంత్రులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఎర్రగడ్డ డివిజన్‌లో నేతలంతా ఐక్యంగా పని చేయాలని, అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేయాలన్నారు. ఎర్రగడ్డ డివిజన్ బూత్ కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు- చేసుకోవాలన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బూత్‌ల వారీగా డివిజన్‌లో ఉన్న 46 బూత్‌ల పరిధిలో సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే అది రాష్ట్ర అభివృద్ధికి సంకేతం అవుతుందన్నారు. తామంతా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని మంత్రులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత అజారుద్దీన్ సహా స్థానిక నేతలు పాల్గొన్నారు.

# హై అలెర్ట్..

(మొదటి తరువాయి)

కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం ఉన్నతాధికారులతో మాట్లాడారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించామని, వారు కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడతారని సీఎం తెలిపారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు- ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని సీఎం ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను



ముందుగానే సిద్ధంగా ఉంచాలని సీఎం ఆదేశించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలని.... పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు- చేసి పర్యవేక్షణ చేయాలన్నారు. నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటు-వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటు-లో ఉంచుకోవాలని... అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం,పశునష్టం చోటుచేసు కోకుండా జాగ్రత్తలు వహించాలని సీఎం తెలిపారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పురపాలక, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో సాగాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# వర్ష నష్టాలు జరక్కుండా చూడండి

(మొదటి తరువాయి)



మంత్రి వెంకట్ రెడ్డి చెప్పుకొచ్చారు. 171 చోట్లలో ఇంకా కాజ్ వే, కల్వర్టులు వద్ద వరద ప్రవాహం ఉన్నట్లు- పేర్కొన్నారు. 108 రాకపోకలకు ఇబ్బంది ఉన్న ప్రాంతాలను గుర్తించినట్లు- చెప్పారు. 71 చోట్ల క్లియర్ చేయగా.. మిగతా చోట్ల సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు- వివరించారు. వాగుల వెంట 58 కి.మీ రోడ్డు కోతకు గురైందని, అందులో 378 మీటర్లు రోడ్డును ప్రభుత్వం మూసివేసిందని తెలిపారు. మొత్తంగా 147 చోట్లలో కాజ్ వే, మైనర్ బ్రిడ్జిలు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు- వెల్లడించారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అవసరమైతే తప్ప రావొద్దని మంత్రి సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు కల్వర్టులు, లో లెవెల్ వంతెనలు, కాజ్ వేల వద్ద ఇంజినీర్లు విధిగా తరచూ క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలన్నారు. ప్రాణనష్టం జరగకుండా ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. అందుకు పోలీస్, విద్యుత్, రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీ రాజ్ శాఖల విభాగాలతో ఆర్ అండ్ బీ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రజా రవాణాకు ఎక్కడా ఇబ్బంది లేకుండా తెగిన రోడ్లు, కల్వర్టులు వద్ద తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. అధికారులు జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని, క్షేత్ర స్థాయి పరిస్థితులు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు.

# కాళేశ్వర..మేడిగడ్డను కూల్చే కుట్రలు

(మొదటి తరువాయి)

పురోగతి లేదన్నారు. పేలుళ్లు జరిగిన ప్రాంతాన్ని సీజ్ చేసి, కారణాలపై అన్వేషణ జరగాలి కదా?మొత్తం వ్యవహారంపై సీబీఐ లేదా స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును పేల్చే కుట్ర చేశారని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కుట్ర వెనుక కాంగ్రెస్, బీజేపీ ఉన్నాయని ఆర్ఎస్పీ ఆరోపించారు. తెంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం పట్ల సంచలన ఆధారాలను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బయటపెట్టారు. 2023వ సంవత్సరం అక్టోబర్ 21వ తేదీన సాయంత్రం 6:20 గంటలకు, మేడిగడ్డ పిల్లర్ల వద్ద భారీ శబ్ధాలు వచ్చాయని మేడిగడ్డ అసిస్టెంట్ ఇంజనీర్ రవికాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు 2023 సంవత్సరం అక్టోబర్ 22వ తేదీన మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ ఫిర్యాదు చేశారు. ఇంతవరకు ఆ ఎఫ్ఐఆర్ పట్ల చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆర్ఎస్పీ నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టును పేల్చే కుట్ర చేశారు. ప్రాజెక్టు పిల్లర్‌కు పగుళ్లు రావు.. క్రస్ట్ గేట్లకు వస్తే రావొచ్చేమో. ఇంటి నిర్మాణానికి సంబంధించిన పిల్లర్లకు కూడా పగుళ్లు రావు.. ఉష్ణోగ్రత తేడాతో గోడలకు పగుళు వస్తాయి కానీ కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒక్కటే 20వ నెంబర్ పిల్లర్‌కి క్రాక్ వచ్చిందంటే, కచ్చితంగా బ్లాస్ట్ జరిగిందనే అనుమానాలు ఉన్నాయని ఆర్ఎస్పీ అనుమానం వ్యక్తం చేశారు. అసలు ఏమాత్రం వరద లేని సమయంలో మేడిగడ్డ బ్యారేజీ ఎలా కుంగిపోయింది.. అది కూడా ఒక్క పిల్లరే ఎలా కుంగిపోతుంది. 2022లో రికార్డు స్థాయిలో వరదలు వచ్చినా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు తట్టు-కున్నాయి. మేడిగడ్డలో ఒక్క పిల్లర్ మాత్రమే ఎందుకు కుంగిపోయింది. కిషన్ రెడ్డి లేఖ రాయగానే ఎన్‌డీఎస్ఏ వచ్చింది. ఉత్తరాఖండ్‌లో మొత్తం డ్యామ్ కొట్టు-కునిపోతే ఎందుకు ఎన్డీఎస్ఏ అక్కడికు వెళ్ళలేదు. మేడిగడ్డ వద్ద పేలుళ్ల శబ్దాలపై ఎన్డీఎస్ఏ ఎందుకు మాట్లాడటంలేదు. మహదేవ్‌పూర్ పోలీసులు వెంటనే విచారణ చేసి ఉండాలి. అసాంఘిక శక్తులు రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇంకా ఎవరైనా అనేది తేల్చాలి. ఈ ముగ్గురి మొబైల్ ఫోన్స్ డేటా చెక్ చేస్తే వెంటనే దొరికేవాళ్ళు . భూపాలపల్లి పోలీసులు అప్పుడు వెంటనే పిల్లర్ల శాంపిల్స్, భూమి శాంపిల్, అక్కడ ఉండే మీటర్ రీడింగ్స్, సిస్మిక్ డేటా, కాల్ డీటెయిల్స్ తీసుకొని ఉండాల్సింది అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు.

# రజనీకాంత్ స్టైలే వేరు

(మొదటి తరువాయి)

నటుడిగా అయిదు దశాబ్దాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. సినీ జీవితంలో స్వర్ణోత్సవం చేసుకుంటున్న సూపర్ స్టార్ రజనీకాంత్‌కి హృదయ పూర్వక శుభాకాంక్షలు. ఆయన ప్రయాణం ఎందరికో స్ఫూర్తిగా నిలిచింది. ప్రతినాయక పాత్ర పోషించినా, కథానాయకుడిగా మెప్పించినా తనదైన స్టైల్‌ను చూపించి ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేశారు.ఆయన నడకలో, సంభాషణలు పలకడంలో, హావభావ విన్యాసంలో ప్రత్యేకతను చూపిస్తారు. రజనీకాంత్‌స్టైల్‌కి నవతరం ప్రేక్షకుల్లోనూ అభిమానులున్నారు. నటు-డిగా స్వర్ణోత్సవ సంబరాలు చేసుకుంటున్న రజనీకాంత్ మరిన్ని విభిన్న పాత్రలతో సినీ ప్రియులను మెప్పించాలని ఆకాంక్షిస్తున్నాను. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు అందించాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

# పోలవరంను కూలవరం అనగలరా?

(మొదటి తరువాయి)

కాఫర్ డ్యామ్ రెండోసారి కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించట్లేదా అని ప్రశ్నించారు. మేడిగడ్డలో 2 పిల్లర్లకు పగుళ్లు వస్తే కూలేశ్వరం అని విమర్శిస్తున్నారు. కాంగ్రెస్, భాజపా నేతలకు పోలవరాన్ని కూలవరం అనే ధైర్యం ఉందా అని కేటీఆర్ ప్రశ్నంచారు.జాతీయ హోదా ఇచ్చి మరీ.. సాక్షాత్తూ ఎన్డీఏ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం కాఫర్ డ్యామ్, రెండో సారి కొట్టుకుపోయినా ఎన్డీఎస్ఏకు కనిపించడం లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. కాళేశ్వరంలోని మేడిగడ్డలో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే కూలేశ్వరం అని కారుకూతలు కూసిన కాంగ్రెస్, బీజేపీ నేతలకు 'పోలవరంను.. కూలవరం' అనే దమ్ము ధైర్యం ఉందా..? అని అడిగారు.తెలంగాణకు వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా..? అని ప్రశ్నించారు. ఏకంగా 10 అడుగుల వెడల్పు.. 7 నుంచి 8 అడుగుల లోతుకు కుంగిన పోలవరం కాఫర్ డ్యామ్‌ను గుట్టుచప్పుడు కాకుండా ఏపీలో యుద్ధప్రాతిపదికన రిపేర్ చేస్తుంటే.. తెలంగాణలో మాత్రం 20 నెలలు కావస్తున్నా మేడిగడ్డ బ్యారేజీ వద్ద తట్టెడు సిమెంట్‌కు దిక్కులేకపోవడానికి ప్రధాన కారణం ముఖ్యమంత్రి మూర్ఖత్వమే అని కేటీఆర్ మండిపడ్డారు. 2020లో పోలవరం డయాఫ్రం వాల్ రెండేండ్లకే కొట్టుకుపోయినా ఇప్పటికీ ఉలుకు లేదు, పలుకూ లేదు. మరోసారి ఏపీలో పోలవరం కాఫర్ డ్యామ్ గోదావరిపాలైనా, ఇటు- తెలంగాణలో ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి 8 మంది మరణించినా ఇప్పటికీ ఎన్డీఎస్ఏ అడ్రస్ లేదు. పంజాబ్‌నే తలదన్నే స్థాయిలో తెలంగాణలో వ్యవసాయ విప్లవాన్ని సృష్టించి, దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ రైతును తీర్చిదిద్దిన కేసీఆర్‌పై కక్షతో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ పార్టీలు సాగిస్తున్న మూకుమ్మడి కుట్రలను కాలరాస్తాం.. తెలంగాణకు జీవనాడి అయిన కాళేశ్వరం ప్రాజెక్టును కంటికి రెప్పలా కాపాడుకుంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. జై తెలంగాణ.. జై కాళేశ్వరం.. అని కేటీఆర్ నినదించారు.

# రాహుల్ విమర్శలకు స్పందించనున్న ఈసీ

(మొదటి తరువాయి)




ఏర్పాటుకు ముందుకు రావడం గమనార్హం. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే సమయంలో తప్ప.. ఇతర అంశాలపై ఎన్నికల సంఘం అధికారికంగా విలేకరుల సమావేశం నిర్వహించడం చాలా అరుదు. ఆదివారం నిర్వహించనున్న మీడియా సమావేశం వెనుక అసలు కారణాన్ని వెల్లడించనప్పటికీ.. కొంతకాలంగా ఈసీపై వెల్లువెత్తుతున్న ఆరోపణలకు సంబంధించినదని అధికారులు తెలిపారు. ప్రతిపక్షాలు 'ఓటు- చోరీ' అనే పదాన్ని పదే పదే వినియోగించడాన్ని ఈసీ ఇప్పటికే తప్పుపట్టింది. తప్పుడు కథనాలకు కారణమయ్యే ప్రచారాన్ని చేసే బదులు ఆధారాలు చూపించాలని పేర్కొంది.బిహార్‌లో ఓట్ల ప్రత్యేక సమగ్ర సవరణ, ఓట్ల చోరీపై ప్రతిపక్షాలు కొంతకాలంగా పెద్దఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర, హరియాణాల్లో ఓట్లు- చోరీకి గురయ్యాయని రాహుల్ గాంధీ ఇటీవల ఆరోపించారు. కర్ణాటకలోని ఒక్క మహాదేవపుర నియోజకవర్గంలోనే లక్ష ఓట్ల చోరీ జరిగిందన్నారు. ఈ ఆరోపణలకు లిఖితపూర్వంగా డిక్లరేషన్ ఇవ్వాలని ఎన్నికల సంఘం కోరింది. లేనిపక్షంలో దేశానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ పరిణామాల నడుమే కీలక సమావేశానికి సిద్ధమైనట్లు- తెలుస్తోంది.

## సంపాదకీయం

# రక్తి కట్టని నేతల రాజకీయ డ్రామాలు !

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడివడ్డాక లెక్కలు తీస్తే రెండు రాష్ట్రాల్లోనూ అప్పులు విపరీతంగా పెరిగాయి. ఒకరిపై ఒకరు బురదజల్లుకుంటున్నారే తప్ప..సమస్య గురించి మాట్లాడడం లేదు. అప్పులు తీర్చే విధమేమిటో చెప్పడం లేదు వేలకోట్లు వడ్డీలకు చెల్లిస్తున్నారు తప్ప, దుబారా అరికట్టే ప్రయత్నం చేయడం లేదు. దుబారా నేతల జీతాలు, విమానాలు, హెలికాప్టరల్ ఖర్చు కింద ఉంది. అలాగే ఉచిత పథకాల కిందా పద్దు ఉంది. ఇవన్నీ అరికట్టకుండా ఐదేళ్లు పాలించినా అప్పులుపెరుగుతాయే తప్ప తగ్గవని గుర్తించాలి. ప్రజలు కూడా ఉచితాలకు అలవాటు పడితే మనమీదే భారం పడుతుందని గమనించాలి. ఇకపోతే ఎపిలో చంద్రబాబు అమరావతి, పి-4 అంటూ పరుగులు తీస్తున్నారు. అమరావతిలో ఉన్న భూమి చాలదన్నట్లు మరో 45 వేల ఎకరాలకు టెండర్ పెట్టారు. జగన్‌ను విమర్శిస్తూ...మరిన్ని అప్పులు చేసేస్తున్నారు. వడ్డీల భారం ప్రజలకు తప్పడం లేదు. గమ్మత్తు ఏంటంటే రెండు రాష్ట్రాల్లో కూడా ఇదే పద్దతి కొనసాగుతోంది. అప్పులు తేవడం, వడ్డీలు కట్టడం ఇదే పాలనగా సాగుతోంది. సకాలంలో జీతాలు చెల్లించడం కూడా ఘనకార్యంగా చెప్పుకుంటున్నారు. మరోవైపు రాజకీయంగా ఎదురుదాడితో నిరంతరం విమర్శలకు పదను పెడుతున్నారు. ఎపిలో జగన్‌ను విమర్శించడంతోనే టిడిపి నేతల కాలం గడిచిపోతోంది. పెన్షన్లు పెంచాం, స్త్రీశక్తి పథకం అమలు చేశాం, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసాం అన్న నినాదం మార్మోగుతోంది. పులివెందుల విజయంతో బ్రహ్మాండం ద్దలు అయినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ తమపై కేసులు పెడతామని బెదిరించారని సింగపూర్ ప్రభుత్వ నేతలు తన పర్యటన సందర్భంలో చెప్పినట్టు చంద్రబాబు నాయుడు మంత్రివర్గ సమావేశంలో వివరించారని సమాచారం. జగన్‌ను రాజకీయంగా అణగదొక్కితేనే టిడిపి నిలుస్తుంది. అందుకే పులివెందులలో నానా డ్రామాలు ఆడారు. జగన్ అధికారంలో ఉండగా అంతకుమించి అన్నట్లుగా వ్యవహరించారు. ఇప్పుడు టిడిపికి సమయం వచ్చింది. ఈ క్రమంలో సింగపూర్ పర్యటన తరవాత తాను వారిని బాబు దువ్వి, క్షమాపణలు కూడా చెప్పానన్న రీతిలో చంద్రబాబు వివరణ ఇచ్చుకున్నారు. వారు మళ్లీ అమరావతికి రావడానికి విముఖంగా వున్నారని, ఆఖరుకు పెట్టుబడిదారుల సమావేశానికి రావడానికి కూడా బలవంతంగా ఒప్పించానని కూడా చంద్రబాబు చెప్పుకొచ్చారు. అయితే జగన్‌పై తాము కేసులు పెడతామని చెప్పినట్టు- ఆయన సింగపూర్‌లో వుండగానే టిడిపి అధికారిక ట్విటర్‌లో పేర్కొన్నారు. ఇంతకూ ఎవరి మీద ఎవరు కేసులు పెడతామన్నారనేది త్వరలో తేలనుంది. అయితే జగన్ వర్సెస్ కూటమి అన్నట్లుగా ఎపి రాజకీయాలు సాగుతున్నాయి. చెల్లి షర్మిల కూడా సమయం చిక్కినప్పుడల్లా అన్న జగన్‌పై చిర్రున లేస్తున్నారు. మొత్తంగా జగన్‌కుకాలం కలసి రావడం లేదు. ఇదిలావుంటే ఇక తెలంగాణలో బిసి రిజర్వేషన్ల రాజకీయం నడుస్తోంది. స్థానిక ఎన్నికలు ముగిసే వరకు ఇదే నడుస్తుంది. తెలంగాణ రాజకీయాల్లో ఒక విచిత్రం ఏమంటే కీలకమైన మూడు పార్టీలూ మిగిలిన రెండు పార్టీలూ కుమ్మక్కు అయ్యాయని పరస్పరం ఆరోపించుకుంటున్నాయి. బిసి బిల్లు గట్టెక్కక పోవడానికి బిఆర్‌ఎస్, బిజెపిలు కుమ్మక్కయ్యాయని కాంగ్రెస్ ఆరోపిస్తుంది. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ కుమ్మక్కయ్యిందని బిజెపి ఆరోపిస్తోంది. కాంగ్రెస్, బిజెపి కుమ్మక్క య్యిందని బిఆర్‌ఎస్ ఆరోపిస్తోంది. మొత్తంగా తమాషా రాజకీయాలు నడిపిస్తున్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ ఒకటేనని కాంగ్రెస్ అంటుంటే...కాంగ్రెస్ బిజెపితో కుమ్మక్కయిందని బిఆర్‌ఎస్ తిట్టిపోస్తుంటుంది. నేనేం తక్కువ అన్నట్టు కాంగ్రెస్, బిఆర్‌ఎస్ 'మ్యాచ్ ఫిక్సింగ్' అంటుంటుంది బిజెపి. మొత్తంగా రాజకీయంగా మైలేజీ కోసం మూడు రాజకీయ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. బిసి రిజర్వేషన్ లెక్కలు తేలేలా లేవు. స్థానిక ఎన్నికలకు కేవలం

పార్టీపరంగా రిజర్వేషన్లను అమలు చేసుకోక తప్పదు. ఇదిలావుంటే పానకంలో పుడకలా తాజాగా కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రేవంత్‌పై బాహాటంగా తిరుగుబాటు ప్రకటించారు. మునుగోడే ముఖ్యం అంటూనే తన మంత్రి పదవి కోరికనుపదేపదే వల్లె వేస్తున్నారు. తనకు మంత్రి పదవి ఇస్తానని మాట తప్పారని ఆరోపిస్తున్నారు. వచ్చే పదేళ్లు నేనే ముఖ్యమంత్రిగా వుంటానని రేవంత్ చెప్పడంలో రాజకీయంగా దాడి ప్రారంభంచారు. రాజగోపాల్ గతంలో బిజెపిలో చేరి, మునుగోడులో చతికిల పడి, మళ్లీ ఎన్నికల ముందే కాంగ్రెస్‌లోకి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచారు. కాంగ్రెస్‌లో రాడానికి మంత్రి పదవిని డిమాండ్ చేసినట్లు చెబుతున్నారు. ఇప్పుడు మంత్రి పదవి లేకుంటే ఆయన రాజకీయ మనుగడ కష్టంగా మారనుందన్న రీతిలో మాట్లాడుతున్నారు. అయితే మంత్రి పదవి అన్నది రాహుల్ పెట్టే భిక్ష. ఆయన ఒకే చేస్తేనే ఇక్కడ పదవి వస్తుంది. ఇది జగమెరిగిన సత్యం. రాజగోపాల్ ఏదయినా రాహుల్‌తో తేల్చుకోవాలి. కాకా పట్టాల్సింది అక్కడే. ఇక తెలంగాణ రాజకీయాల్లో మరో తమాషా ఏమంటే బిజెపిలో కేంద్రమంత్రులు బండి సంజరు, కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌లు మూడు శిబిరాలైతే బిఆర్‌ఎస్‌లో కెసిఆర్ గాక కెటిఆర్, కవిత, హరీశ్‌ల మధ్య ప్రత్యక్ష పోటీనే నడుస్తున్నది. తమ పార్టీని బిజెపిలో కలిపేందుకు కొన్ని దయ్యాలు పని చేస్తున్నాయని కవిత అంటుంటే, ఆమె వెనక అదృశ్య శక్తులు చేరి ఇలా మాట్లాడిస్తున్నాయని విధేయ నేతల ఆరోపణ. కాంగ్రెస్‌లో సరే ఎలాగూ వేర్వేరు నేతలు పోటీ పడుతూనే వుంటారు. ఈ రాజకీయ మాయాజాలంలో ఎవరు ఏమిటో ప్రజలకు బాగా తెలుసు. వారు దగ్గరనుంచి అన్నీ గమనిస్తున్నారని ఆయా పార్టీల నేతలు గుర్తించాలి. తమ డ్రామాలను ప్రజలు గుర్తిస్తున్నాని కూడా గమనించాలి. ఇలాగే రాజకీయ డ్రామాలు ఆడితే ఏదో ఒకరోజు ఓప్పుడో ఒకప్పుడు వారు తమ అక్కసు వెళ్లగక్కగ తప్పదు.

# హిమాచల్‌లో వర్ష బీభత్సానికి 257 మంది మృతి

**సిమ్లా, -ప్రజా స్వేచ్ఛ**

హిమాచల్ ప్రదేశ్‌లో జూన్ 20 నుంచి జరుగుతున్న వర్ష బీభత్సం ఇప్పటివరకు 257 మందిని బలి గొన్నట్లు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ శనివారం తెలిపింది. భారీ వర్షాలకు తీవ్రంగా ప్రభావితమైన జిల్లాలలో మండి(26 మరణాలు), కంగ్ర(28), కులూ(11) ఉన్నాయి. వర్షాల కారణంగా సంభవించిన కొండచరియలు విరిగిపడడం, ఆకస్మిక వరదలు, గల్లంతు, విద్యుదాఘాతం వంటి ఘటనల్లో 133 మంది మరణించగా మరో 124 మంది రోడ్డు ప్రమాదాలలో మరణించారు. వర్షాల వల్ల భారీ ఆస్తి నష్టం జరిగిందని నివేదిక తెలిపింది. కొండచరియలు విరిగిపడడం, ఆకస్మిక వరదల కారణంగా 16



మరణాలు చోటుచేసుకోగా పొంగి ప్రవహిస్తున్న నదులు, చెరువులలో 27 మంది కొట్టుకుపోయారని సంస్థ వివరించింది. పిడుగుపాటు, అగ్నిప్రమాదాలు, పాము కాట్లు, విద్యుదాఘాతం, ప్రమాదవశాత్తు పడిపోయిన ఘటనల్లో చాలామంది మరణించినట్లు నివేదిక పేర్కొంది.

**మహారాష్ట్రలో ఐదుగురి మృతి**

మహారాష్ట్రలో గడచిన రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఐదుగురు మరణించగా మరికొందరు గాయపడ్డారు. ముంబైలోని వఖ్రోలీ ప్రాంతంలో శనివారం ఉదయం భారీ వర్షానికి కొండ చరియ విరిగి ఓ ఇంటిపై పడగా ఇద్దరు వ్యక్తులు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. జనకళ్యాణ్ సొసైటీలోని ఇంటిపై కొండచరియ విరిగిపడిన సమయంలో కుటుంబ సభ్యులు నలుగురూ ఇంట్లోనే ఉన్నారు. నగరంలోని అనేక ప్రాంతాలు నీట మునిగాయి.

# మానవత్వాన్ని ఏఐ తుడిచిపెడుతుంది

**-అది తెలివి మీరితే మనిషి విధించిన పరిమితులను అధిగమించేందుకు యత్నిస్తుంది**

**-కృత్రిమ మేధ గాడ్‌ఫాదర్ జెఫ్రీ హింటన్ హెచ్చరిక**

**-మాతృత్వ లక్షణాలను జోడించాలని పిలుపు**

**లాస్‌వేగాస్ -ప్రజా స్వేచ్ఛ**

కృత్రిమ మేధ (ఏఐ) మానవత్వాన్ని తుడిచి పెట్టే ప్రమాదముందని ఏఐ గాడ్‌ఫాదర్ జెఫ్రీ హింటన్ హెచ్చరించారు. ఏఐపై శాశ్వత మానవ ఆధిపత్యాన్ని కొనసాగించడం సాధ్యమవుతుందనే వాదనను ఏఐ గాడ్‌ఫాదర్ జెఫ్రీ హింటన్ తిరస్కరించారు. ఎప్పుడైతే ఏఐ సిస్టమ్స్ మానవుల కన్నా అధిక తెలివితేటలు గలవి అవుతాయో, అప్పుడు అవి మనిషి విధించిన పరిమితులను అధిగమించేందుకు మార్గాలను అన్వేషించగలుగుతాయని చెప్పారు. ఏఐని వినయ, విధేయతలు కలిగిన దానిగా ఉంచేందుకు చేసే ప్రయత్నాలు అంతిమంగా విఫలమవుతాయన్నారు. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సృజనాత్మకత దాన్ని సృష్టించిన మనుషుల కన్నా ఎక్కువగా అడ్వాన్స్‌డ్ ఏఐకి ఉంటుందని తెలిపారు. లాస్ వెగాస్‌లో ఇటీవల జరిగిన ఏఐ4 సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఏఐ సిస్టమ్స్‌కు మాతృత్వాన్ని జోడించడం వల్ల మానవుల పట్ల సంరక్షణ, పరిరక్షణ దృష్టితో చూసే విధంగా వాటికి మార్గదర్శనం చేయవచ్చునని తెలిపారు. హింటన్ డీప్ లెర్నింగ్ టెక్నాలజీస్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. ఏఐ అంతిమంగా మానవుడి అంతానికి దారి తీసే



అవకాశం 10-20 శాతం ఉందని గతంలో చెప్పారు. ప్రస్తుతం పారిశ్రామిక రంగం ఏఐ సిస్టమ్స్‌ను కట్టుదిట్టమైన మానవ నియంత్రణలో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీనిని హింటన్ సవాల్ చేస్తున్నారు. మానవ మేధాశక్తిని మెషిన్స్ అధిగమిస్తే మానవ నియంత్రణలో వాటిని పని చేయించడానికి చేసే ప్రయత్నాలు నిష్ఫలమవుతాయని ఆయన వాదిస్తున్నారు. హింటన్ హెచ్చరికలకు బలం చేకూరడానికి కారణం ఏమిటంటే, ఓ ఏఐ సిస్టమ్ ఓ ఇంజినీరును బెదిరించే ప్రయత్నం చేసింది. భవిష్యత్తులో ఏఐ మోడల్స్‌లో కూడా ఈ విధంగా మోసం చేయడం, తనను తాను కాపాడుకోవడం వంటి లక్షణాలు ఉంటాయని భావిస్తున్నారు.

**మాతృత్వాన్ని జోడించాలి**

మనిషికి తన సంతానంతో ఉండే సహజ సంబంధాలను ప్రేరణగా తీసుకుని ఏఐ సిస్టమ్స్‌ను డిజైన్ చేయాలని హింటన్ సలహా ఇచ్చారు. తక్కువ తెలివిగల బిడ్డ ఎక్కువ తెలివైన తల్లిని ప్రభావితం చేసి, ఆమె నుంచి రక్షణ పొందుతాడని గుర్తు చేశారు. తల్లికి తన పిల్లలను సంరక్షించే స్వభావం ఉంటుందని, ఆ స్వభావాన్ని ఏఐకి జోడిస్తే, సహజంగానే ఏఐ సిస్టమ్స్ మనుషులను సంరక్షించేందుకు మొగ్గు చూపుతాయని తెలిపారు. అటువంటి లక్షణాలుగల ఏఐ సిస్టమ్స్ మానవాళికి వ్యతిరేకంగా పని చేసే అవకాశం తక్కువగా ఉండవచ్చునని చెప్పారు. సూపర్ ఇంటెలిజెంట్ ఏఐ తల్లులు చాలా వరకు మాతృత్వ స్వభావాన్ని వదులుకోవాలని కోరుకోవన్నారు. మనం మరణించాలని అవి కోరుకోకపోవడమే దీనికి కారణమని చెప్పారు. "తల్లిదండ్రుల మాదిరిగా అది నన్ను సాకకపోతే, అది నన్ను మార్చేసి, నా స్థానంలోకి వచ్చేస్తుంది" అన్నారు. మనిషి లాంటి ఏఐ సిస్టమ్స్ రావడానికి 30-50 సంవత్సరాలు పడుతుందని హింటన్ గతంలో అంచనా వేశారు. కానీ, మరో 5-20 ఏండ్లలో ఇవి రావచ్చునని ఆయన తాజాగా చెప్పారు. ఏఐ సిస్టమ్స్‌తో ముప్పు ఉన్నప్పటికీ ప్రయోజనాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఉదాహరణకు, ఔషధాల అభివృద్ధి,సత్వరమే రోగ నిర్ధారణ చేయడం, చికిత్సకు ప్రణాళికను రచించడంలో, క్యాన్సర్ చికిత్సలలో ఏఐ విశేషంగా సేవలందిస్తుందన్నారు. అయితే ఏఐ సహకారంతో మానవుడు మరణం లేకుండా జీవించగలుగుతాడనడంపై సందేహాలు వ్యక్తం చేశారు.

# పేదవాడు ఆత్మగౌరవంతో తలెత్తుకునేలా సంక్షేమాన్ని అందిస్తా

**వ్యక్తిగత పగకోసం పదవిని వాడను**

**ఆ స్థాయి ఉంటేనే శత్రువుగా భావిస్తా..**

**హాసిత భాష్పాలు పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్**




**హైదరాబాద్ -ప్రజా స్వేచ్ఛ**

అద్దాల మేడలు, రంగుల గోడలు అభివృద్ధి కాదనీ, పేదవాడు తలెత్తుకుని తిరిగేలా పాలన సాగినప్పుడే నిజమైన అభివృద్ధి అని అంబేద్కర్ వ్యాఖ్యానించినట్టుగా తమ సర్కారు పేదల కోసం పనిచేస్తున్నదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ కవి అందెశ్రీ రచించిన 'హాసిత భాష్పాలు' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలు తమపై పెద్ద బాధ్యత పెట్టారని చెప్పారు. నాలుగు కోట్ల మంది సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నానని అన్నారు. సీఎం పదవి నా చేతుల్లో ఉన్నంత కాలం ప్రజల కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. నాలుగున్నర లక్షల మంది సొంతింటి కల నెరవేరుస్తున్నామనీ, మూడు కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని అన్నారు. రాచరికం నుంచి ప్రజాస్వామ్యంలోకి వచ్చిన ఆనందంలో ప్రజలున్నారని గుర్తు చేశారు. ప్రతి రోజూ ప్రజలతో ఉండే అవకాశం వచ్చిందన్నారు. పోరాటానికి స్ఫూర్తినిచ్చిన గడ్డ తెలంగాణ అనీ, 2047 వరకు మూడు ట్రిలియన్ డాలర్ ఎకానమీ తన లక్ష్యమని చెప్పారు. తెలంగాణ సమాజం కవులకు, పోరాటానికి స్ఫూర్తినిచ్చిన గడ్డ అని కొనియాడారు. ఉద్యమంలో ప్రజలకు ఎంతో మంది కవులు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. గూడ అంజన్న, దాశరథి, కాళోజీ, అందెశ్రీ, గద్దర్, గోరటి వెంకన్న ఇలా అనేక మంది ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కొందరు నకిలీ ఉద్యమకారులు తామే ఉద్యమకారులమని చెప్పుకుంటూ తిరుగుతున్నారని విమర్శించారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ఉద్యమకారులని చెప్పుకునే వాళ్లకు అన్ని వేల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తెలంగాణతో పేగు బంధం,పేరు బంధం అన్ని తెంచుకున్నారని విమర్శించారు. దేశానికి నాయకత్వం వహించాలనే దురాశతో అన్నీ కోల్పోయారని అన్నారు. వారు అలా చెప్పుకొని తిరగడానికి కారణం.. నిజమైన ఉద్యమ కారులు ఎవ్వరూ కూడా మేము ఉద్యమకారులం అని చెప్పుకోకవడమేనని తెలిపారు. నిజమైన ఉద్యమకారులంతా గర్వంగా చెప్పుకోవాలని సూచించారు. రాజకీయాల్లో తాను ఎవరినీ శత్రువులుగా చూడననీ, అలా చూడాలన్నా వాళ్ళకి ఆ స్థాయి ఉండాలని తెలిపారు. శత్రువులకు నా గెలుపే అసలైన శిక్ష అని చెప్పారు. తనకు రాజకీయాల్లో శత్రువులెవరూ లేరన్నారు. వ్యక్తిగత పగకోసం తన పదవిని అడ్డం పెట్టుకుంటే తనకన్నా మూర్ఖుడు ఇంకొకరు ఉండరని అభిప్రాయపడ్డారు. తనకు అన్ని చట్ట సభల్లో పనిచేసిన అనుభవం ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్, అందెశ్రీ తదితరులు

# వలిగొండలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

## ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజా స్వేచ్ఛ వలిగొండ ( ప్రతినిధి)**
రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం వలిగొండ మండల కేంద్రంలోని దేవిశ్రీ ఫంక్షన్ హాల్ లో ఆర్డీఓ వెలమ శేఖర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలిగొండ మండలానికి 3,వేల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు దేశంలోనే ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో దొడ్డు బియ్యంకి బదులుగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు కొత్త రేషన్ కార్డుల కోసం10 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న అర్హులైన పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేసి, సన్న బియ్యం ద్వారా వారి కడుపు నింపాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం, అని చెప్పారు. గతంలో రేషన్ ద్వారా వచ్చిన నాణ్యతలేని బియ్యం దళారుల చేతిలో పోయేదని,అన్నారు అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు కల్పించేందుకు తాను కట్టుబడి ఉన్నానన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొటిగా నెరవేరుస్తున్నామని.ఎవరికీ అన్యాయం జరగకుండా సంక్షేమ పథకాలను అందించేందుకు అధికారులంతా బాధ్యతతో పనిచేయాలి, అని సూచించారు. అలాగే, అందరికీ ఆసరా పింఛన్లు ఇవ్వడం కూడా ప్రభుత్వ కర్తవ్యం అని పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమంలో పోరాడినవారు గత ప్రభుత్వం కాలంలో నిరాశ చెందారని వ్యాఖ్యానించారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని, రాష్ట్రానికి తెలంగాణను ఇచ్చిన పార్టీ కాంగ్రెస్‌యే అని, పేదలకు న్యాయం చేయగలిగేది కూడా కాంగ్రెస్‌యే అని ఆయన స్పష్టం చేశారు ప్రజల ఆశీస్సులు కాంగ్రెస్ పార్టీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఉండాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, తహసిల్దార్ దశరథ ఎంపీడీవో జి జలంధర్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య బీమా నాయక్ మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి పాశం సత్తిరెడ్డి కంకల కిష్టయ్య ఈతాప రాములు కేసిరెడ్డి నీరజారెడ్డి మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు రేషన్ డీలర్లు నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తంగా ఉండండి

## -వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



**-లోతట్టు ప్రాంతాల ప్రజలను శిబిరాలకు తరలించండి**
**-క్షేత్ర స్థాయిలో పని చేయండి**



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



**హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ**
భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందనే వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసం నుంచి సీఎం.. ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు సూచనలు చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను మోహరించాలని దిశానిర్దేశం చేశారు. వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదమున్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలనీ, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని సీఎం ఆదేశించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలని సూచించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం చోటుచేసుకోకుండా రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, వైద్యారోగ్య, పురపాలక, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో సాగాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని సీఎం ఆదేశించారు.

# కవితక్కశక్తి వంత మైన నేత

## - సూరారపు కృష్ణవేణి



**/ప్రజా స్వేచ్ఛ సూర్యాపేట జిల్లా ప్రతినిధి**
జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత దేశం లోనే శక్తి వంతమైన నాయకురాలు అని ప్రజా ఉద్యమ నిర్మాణాలు చేస్తూ భవిష్యత్ తరాలకు సమర్ధవంత మైన నాయకత్వాన్ని పాలనను అందించడం కోసం కవితక్క వినూత్న పద్ధతి లో ముందుకు సాగుతున్నారని తెలంగాణ జాగృతి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు సూరారపు కృష్ణవేణి అన్నారు ఆమె హైదరాబాద్ కేంద్ర కార్యాలయం లో కవిత ని మర్యాద పూర్వకంగా కలిసి తనను జిల్లా ప్రెసిడెంట్ గా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు,పుష్ప గుచ్చం అంద చేసి కవితక్క ఆశీర్వాదం తీసుకున్నారు,ఈ సందర్భంగా కృష్ణ వేణి కి అభినందలు తెలుపుతూ భవిష్యత్ కార్యక్రమాల దిశా నిర్దేశం చేశారుఈ సందర్భంగా కృష్ణవేణి మీడియా కు ప్రకటన విడుదల చేశారు సూర్యాపేట జిల్లా లో జాగృతిని బలో పేతం చేస్తానని,ప్రజా సమస్యల పై పోరాడుతామని,ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయక పోతే ఉద్యమిస్తామని వెల్లడించారు .


# అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న : జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ బ్యూరో/ప్రజా స్వేచ్ఛ**
స్వాతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త,అణగారిన వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న అని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు.శనివారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులతో కలిసి కాకినాడ తన క్యాంపు కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతి,రైతుల సంక్షేమం, కార్మికుల హక్కుల కోసం గౌతు లచ్చన్న వీరోచిత పోరాటం చేశారన్నారు.స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో చురుకుగా పాల్గొని శ్రీకాకుళం,విజయనగరం ఇతర ప్రాంతాల ప్రజలను చైతన్యవంతులను చేయడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. వెనుకబడిన వర్గాల ప్రజలను చదువుకునేలా ప్రోత్సహించేందుకు హాస్టళ్ళు,పాఠశాలలు ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. భావితరాలకు సర్దార్ గౌతు లచ్చన్న జీవితాన్ని ఆదర్శంగా నిలుస్తుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమములో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం.లిల్లి,బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ.శ్రీనివాసరావు,సహాయ బీసీ.సంక్షేమాధికారి పి.రామ క్రిష్ణ,డబ్ల్యూహెచ్వోలు బహుదూర్,వై. కల్పన, కారపు సూర్య శివ ప్రసాద్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాచమల్ల కృష్ణ పటేల్ జన్మ దిన వేడుకలు..

## పాల్గొన్న ప్రముఖులు..



**ప్రజా స్వేచ్ఛ లింగంపల్లి ప్రతినిది**
మియాపూర్ కు చెందిన ప్రముఖ సంఘ సేవకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సినీ నిర్మాత, పుర ప్రముఖులు రాచమల్ల కృష్ణ పటేల్ పుట్టినరోజు సందర్భంగా మియాపూర్‌లో ని ఆయననివాసం లో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్య క్రమంలో మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్, మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తాండ్ర రామచందర్ గౌడ్, వినోద్ చౌదరి, గంగాధర్, బాపిరెడ్డి, నాని, సింహాచలం, గురువులు, రాము, వంశీ, కృష్ణ, గోపీ, యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ సేవకులు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సినీ నిర్మాత, పురప్రముఖులు రాచమల్ల కృష్ణ పటేల్ నిండు నూరేళ్ళు వర్ధిల్లాలి అని ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ నాయకుడు నాగశేషి యాదవ్ అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

డాక్టర్.జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు.



**ప్రజా స్వేచ్ఛ గోపాల్ పేట /వనపర్తి జిల్లా ప్రతినిధి**

గోపాల్ పేట టౌన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నాగశేషి యాదవ్ మరణించిన విషయం,టౌన్ కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్.జిల్లెల.చిన్నారెడ్డి, వారి అంతక్రియల నిమిత్తం రూ,5,000/– ఆర్థిక సహాయం టౌన్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా పంపించడం జరిగింది. టౌన్ కాంగ్రెస్ నాయకులు నాగశేషి యాదవ్ భార్యకి ఆర్థిక సహాయం అందజేసి డా.జి.చిన్నారెడ్డి తరపున వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాగశేషి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని మనోధైర్యం ఇచ్చారు.నాగశేషి లేని లోటు కాంగ్రెస్ పార్టీకి తీరనిది అని, నాగశేషి యాదవ్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలోలక్ష్మణ్,ప్రేమ్ కుమార్ యాదవ్,బాలకృష్ణ, బొక్కలయ్య,ఆర్టీసీ డ్రైవర్ కురుమయ్య,వెంకట యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని మార్పు చెయ్యాలని మహబూబ్ నగర్ ఎం పి కి వినతి పత్రం

–బసిరెడ్డి సంతోష్ రెడ్డి.



**సీసీ కుంట /వనపర్తి జిల్లా ప్రతినిధి ప్రజా స్వేచ్ఛ**

చిన్న చింత కుంటమండలంలో పలు అభివృద్ధి పథకాల ప్రారంభోత్సవాల కార్యక్రమాలకు వచ్చిన మహబూబ్ నగర్ ఎం పి కి,నియబందనలకు వ్యతిరేకంగా ఇథనాల్ కెమికల్ కంపెనీ దగ్గర ఎటువంటి సౌకర్యాలు లేని ధమగ్నాపూర్ పూర్ గ్రామంలో నిర్మిస్తున్నారని 2500 మంది విద్యార్థుల భవిష్యత్ తరాలు అనారోగ్య పాలు అవుతారని ప్రజాఅభిప్రాయ సేకరణ జరిపి,సౌకర్యాలు ఉన్న దగ్గర నిర్మాణం చేయాలని కోరడం జరిగింది

## సుంకిశాలలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**యాదాద్రి ప్రజా స్వేచ్ఛ**

మండల పరిధిలోని సుంకిశాల గ్రామంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను గ్రామ పంచాయతీ వద్ద ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా వాడవాడలా మువ్వన్నెల జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేములకొండ శ్రీ మత్స్యగిరిగుట్ట ధర్మకర్త ఈతాప రాములు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చెరుకు శివయ్య గౌడ్ మాజీ సర్పంచ్ మొగిలిపాక నరసింహ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వీరస్వామి ఇంజమూరి రమేష్ పోలేపల్లి బాలకృష్ణ ఈతాప మల్లేశం ప్రధానోపాధ్యాయులు బుగ్గారెడ్డి పాల సంఘం చైర్మన్ బొక్క రామకృష్ణారెడ్డి విద్యా కమిటీ మహిళ సంఘం అధ్యక్షురాలు కోకాల మంగమ్మ అంగన్వాడీ టీచర్ కళమ్మ వెటర్నరీ డాక్టర్ వెంకటరమణ ఫీల్డ్ అసిస్టెంట్ కొమ్మగాని జంగయ్య తదితరులు పాల్గొన్నారు

## ఉట్లు కొట్టిన వారిని ఘనంగా సన్మానించిన సామాజిక కార్యకర్త :సునీత -నరేంద్ర గౌడ్

**కనగల్లు, ప్రజా స్వేచ్ఛ**

శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఘనంగా సన్మానించిన సామాజిక కార్యకర్త సునీత -నరేందర్ గౌడ్ ప్రథమంగా ఉట్టికొట్టిన వారికి 3016 రూపాయలు మరియు ద్వితీయ బహుమతిగా 2016 రూపాయలు ఇచ్చి యాదవ సోదరులను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లా టిడిపి విభిన్న ప్రతిభవంతుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర పుట్టిన రోజు వేడుకలు





**హాజరై ఆశీస్సులు అందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

**ప్రజా స్వేచ్ఛ కాకినాడ జిల్లా జగ్గంపేట ప్రతినిధి**

కాకినాడ జిల్లా టిడిపి విభిన్న ప్రతిభ వంతుల అధ్యక్షులు మండపాక అప్పన్నదొర పుట్టినరోజు వేడుకలు అంగరంగ వైభవంగా శనివారం ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీను మణిబాబు ఆధ్వర్యంలో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీటీడీ బోర్డు మెంబర్,జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొని కేకును కట్ చేసి వినిపించారు.నెహ్రూ ఆశీర్వాదాలు అప్పన్న దొర పొందాడు.ఈ సందర్భంగా అప్పన్న దొర మాట్లాడుతూ చిన్న కార్యకర్త నుంచి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ గా,కాకినాడ జిల్లా విభిన్న ప్రతిభవంతుల అధ్యక్షులుగా నన్ను నియమించిన తన ఆరాధ్య దైవం జ్యోతుల నెహ్రూ కి, యువనేత,యంగ్ అండ్ డైనమిక్ లీడర్ జ్యోతు నవీన్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. యువ కార్యకర్తలకు మార్గదర్శినిగా నిలిచిన మండల అధ్యక్షులు జీను మణిబాబుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మారిశెట్టి భద్రం, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు,టౌన్ టిడిపి అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు,నియోజవర్గ యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి,నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వేములకొండ జోగారావు, మండల యువత అధ్యక్షులు రాయి సాయి, నియోజవర్గ యువత ఉపాధ్యక్షులు బద్ది సురేష్, దాపర్తి సీతారామయ్య, తాళ్లూరు సర్పంచ్ ఎస్ వీరబాబు,కొండ్రోతు శ్రీను, తూము కుమార్,కుర్ల చిన్నబాబు,కొత్త ప్రసాద్, కాళ్ల వెంకటేష్,కోడూరి రమేష్, గొల్లపల్లి శ్రీదేవి,షేక్ వల్లి, య గ్రంశెట్టి మణికంఠ,దార బల్ల గోవిందు,సద్గురు మూర్తి అధిక సంఖ్యలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నిరుపేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

**-జులై నెలలో 29 ఎల్ఓసి లు.**

**-239 సీఎంఆర్ఎఫ్ చెక్కులు.**



**ప్రజా స్వేచ్ఛ వనపర్తి జిల్లా ప్రతినిధి**

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి,నియోజకవర్గ పరిధిలోని నిరుపేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్నారు.ఆర్థిక స్తోమత లేక తాము మెరుగైన వైద్యం చేయించుకోలేకపోతున్నామని, తనను ఆశ్రయించిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం తరపున వారి చికిత్సకు సరిపోయేంత ఎల్ఓసి లను మంజూరు చేయించి తన మానవత్వాన్ని చాటుకుంటున్నారు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి. జూలై నెల 30 రోజుల్లో రోజుకో ఎల్ఓసి చొప్పున,29 ఎల్ఓసి లను మంజూరు చేయించారు. అదేవిధంగా జులై నెలలో రూ.68 లక్షల 80 వేల విలువగల,239 సీఎంఆర్ఎఫ్ చెక్కులను సైతం ఎమ్మెల్యే మంజూరు చేయించారు.ఈ సందర్భంగా ఆయన రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన కల్వకోలు సత్యం మెరుగైన వైద్యం చేయించుకునేందుకు,రూ. 5లక్షలు,ప్రస్తుతం మరో రూ.3 లక్షలు మొత్తం రూ.8 లక్షల విలువగల ఎల్ఓసి నీ ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీల కతీతంగా తన,మన బేధం లేకుండా ఆపదలో ఉన్నానంటే,ఆయన ఆలోచించకుండా అపన్న హస్తము అందిస్తూ వస్తున్నారు.ఈ విధంగా ఒక్కో నెలలో రోజుకు ఒకటి,రెండు ఎల్ఓసి లను 300 నుంచి 400 సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయిస్తూ నిరుపేదల ఆరోగ్యాభివృద్ధికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఎంతో తోడ్పాటును అందిస్తున్నారని నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్





**ప్రజా స్వేచ్ఛ పటాన్ చేరు ప్రతినిధి**

పటాన్చెరు అమీన్పూర్ శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినం పురస్కరించుకొని పటాన్చెరు డివిజన్ పరిధిలోని జెపి కాలనీలో గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో నిర్వహించిన జన్మాష్టమి వేడుకల్లో పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త, స్థానిక కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్.. ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ ప్రజలందరికీ శ్రీ కృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు.



**ఇస్నాపూర్ లో**

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం పురస్కరించుకొని.. ఇస్నాపూర్ మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన జన్మాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సిఐ వినాయక రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**అమీన్పూర్లో**

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం పురస్కరించుకుని..అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ శివాలయం గుట్టపై ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# బిజినెస్

## తగ్గుతున్న బంగారం ధరలు.. హైదరాబాద్, విజయవాడలో తులం ఎంతుందంటే..

బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ట్రేడ్ అవుతున్నాయి.. ఇటీవల బంగారం ధర పది గ్రాములు ఏకంగా లక్షా 3 వేలు దాటింది.. వెండి కూడా అదే బాటలో కొనసాగుతోంది. వాస్తవానికి బంగారం, వెండి ధరలలో నిరంతరం మార్పు ఉంటుంది. కొన్నిసార్లు పెరుగుతూ, మరికొన్ని కొన్నిసార్లు తగ్గుతూ ఉంటాయి.. గత నాలుగు రోజుల క్రితం రికార్డు స్థాయిలో పెరిగిన బంగారం ధర.. తగ్గుతూ వస్తోంది.. ఆగస్టు 16 శనివారం ఉదయం ఆరుగంటల వరకు నమోదైన ధరల ప్రకారం.. దేశియంగా బంగారం ధర స్వల్పంగా తగ్గగా.. వెండి ధర స్వల్పంగా పెరిగింది.

**దేశియంగా బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకోండి..**

24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.10 మేర ధర తగ్గి.. రూ.1,01,230 గా ఉంది..

22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.10 మేర ధర తగ్గి.. రూ.92,790 కి చేరుకుంది.

వెండి కిలో ధర రూ.100 పెరిగి.. రూ.1,16,200లుగా ఉంది.



అయితే, ప్రాంతాల వారిగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది.

**ప్రధాన నగరాల్లో బంగారం ధరలు..**

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,01,230 ఉంటే.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.92,790 ఉంది. కిలో వెండి ధర రూ.1,26,200 గా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,01,230, 22 క్యారెట్ల ధర రూ.92,790 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,26,200 లుగా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,01,380, 22 క్యారెట్ల ధర రూ.92,940 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,16,200 ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,01,230, 22 క్యారెట్ల ధర రూ.93,790 ఉంది. వెండి ధర కిలో రూ.1,16,200 ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,01,230 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.92,790 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,26,200 ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,01,230, 22 క్యారెట్ల ధర రూ.92,790 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,16,200 ఉంది.

## బంపర్ ఆఫర్ అంటే ఇదే.. నెల రోజులు నెట్ ఫ్రీ.. పండగే పండగా..




గత కొన్ని రోజులుగా టెలికామ్ రంగంలో బీఎస్ఎన్ఎల్ దూకుడు ప్రదర్శిస్తోంది. జియో, ఎయిర్‌టెల్ సంస్థలకు పోటీగా కస్టమర్లను ఆకట్టుకునేందుకు కొత్త కొత్త ఆఫర్లను ప్రవేశపెడుతోంది. తాజాగా రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్‌లకు గట్టి పోటీ ఇచ్చేందుకు 'మాన్‌సూన్ ధమాకా' పేరుతో ఒక కొత్త ఆఫర్‌ను ప్రకటించింది. ఈ పరిమిత కాల ఆఫర్ కింద, కొత్త ఫైబర్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ తీసుకునే వినియోగదారులకు మొదటి నెల ఉచిత సేవలను అందిస్తోంది. కొత్తగా బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ పొందే వారికి ఇన్‌స్టాలేషన్ రోజు నుంచి ఒక నెల పాటు ఎటువంటి ఛార్జీలు లేకుండా సేవలు లభిస్తాయి. ఈ ఉచిత సేవ ద్వారా, వినియోగదారులు BSNL క్వాలిటీ, స్పీడ్‌ను పరీక్షించుకోవచ్చు.ఈ ఆఫర్ సెప్టెంబర్ 30, 2025 వరకు అందుబాటులో ఉంటుంది. అంటే ఈ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలనుకునే వారికి దాదాపు నెలన్నర సమయం ఉంది.

**బీఎస్ఎన్ఎల్ మరో ఆఫర్**

ఈ ఆఫర్ తో పాటు కంపెనీ రూ.449 ప్లాన్ కొనుగోలుపై మూడు నెలల పాటు రూ.50 డిస్కౌంట్ ఇస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పాటు ఒక వ్యక్తి రూ.499 ప్లాన్ కొనుగోలు చేస్తే.. రాబోయే మూడు నెలల పాటు రూ.100 డిస్కౌంట్ ఇవ్వనుంది.

ప్రస్తుతం రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ రెండింటిలోనూ వినియోగదారులకు ఇలాంటి రీఛార్జ్ ఆఫర్ లేదు. కొత్త కస్టమర్లను ఆకర్షించడానికి జియో, ఎయిర్‌టెల్ వంటి కంపెనీలతో పోటీ పడటానికి బీఎస్ఎన్ఎల్ ఈ ఆఫర్‌ను తీసుకొచ్చింది. ఉచిత బ్రాడ్‌బ్యాండ్ ఆఫర్ మొదటి నెల వినియోగదారులకు ఉచిత సేవను అందించడమే కాదు.. బీఎస్ఎన్ఎల్ సేవలు ఎలా ఉన్నాయో మీరు తెలుసుకోవచ్చు. దీంతో పాటు రాబోయే నెలల్లో మీరు డిస్కౌంట్‌లను కూడా సద్వినియోగం చేసుకోవచ్చు.

## యమహా నయా స్కూటర్.. గరిష్ఠ ధర రూ.1.02 లక్షలు



**చెన్నై, ఆగస్టు 16**

యమహా దేశీయ మార్కెట్లోకి హైబ్రిడ్ స్కూటర్‌ను పరిచయం చేసింది. 125 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ స్కూటర్ ఐదు రకాల్లో లభించనున్నది. ఫాస్కినో 125 ఎఫ్ఐ హైబ్రిడ్, రేజెడ్ఆర్ 125 ఎఫ్ఐ హైబ్రిడ్‌లు అడ్వాన్స్ స్మార్ట్ ఫీచర్స్, ట్కస్టైలిష్ లుక్‌తో తయారు చేసింది. ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ.79,340 నుంచి రూ.1,02,790 ధరల్లో లభించనున్నాయి. స్మార్ట్ మోటర్ జనరేటర్ టెక్నాలజీ, సైలెంట్ స్టార్ట్ అండ్ స్టాప్ సిస్టమ్, నావిగేషన్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది.

# స్పోర్ట్స్

## 5233 పరుగులు.. 373 వికెట్లు.. కట్‌చేస్తే.. ఆల్ రౌండర్‌పై నిషేధం విధించిన ఐసీసీ.. ఎందుకంటే?


క్రికెట్ ప్రపంచం నుంచి ఒక సిగ్గుచేటు చర్య వెలుగులోకి వచ్చింది. ఒక ఆల్ రౌండర్ చేయకూడని పనితో ఇబ్బందుల్లో పడ్డాడు. దీని కారణంగా అతనిపై ఐసీసీ 5 సంవత్సరాల నిషేధం విధించింది. ఒక టోర్నమెంట్ సందర్భంగా, ఈ ఆల్ రౌండర్ క్రికెట్ ప్రతిష్టను దిగజార్చాడు. ఈ ఆటగాడి పేరు సాలియా సమన్, అతను శ్రీలంక మాజీ ఆల్ రౌండర్. మ్యాచ్ ఫిక్సింగ్‌కు సంబంధించిన కేసులలో అతనిని ఐసీసీ నిషేధించింది.

**సాలియా సమన్‌పై 5 ఏళ్ల నిషేధం..**

సాలియా సమన్ శ్రీలంక దేశవాళీ క్రికెటర్, 2021 అబుదాబి T10 లీగ్ సందర్భంగా ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు అవినీతి నిరోధక నియమావళిని ఉల్లంఘించినందుకు దోషిగా తేలాడు. దోషిగా తేలిన తర్వాత, అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ అతనిపై 5 సంవత్సరాల నిషేధం విధించింది. సెప్టెంబర్ 2023లో కోడ్‌ను ఉల్లంఘించినందుకు అభియోగాలు మోపబడిన ఎనిమిది మందిలో సాలియా సమన్ కూడా ఉన్నారు. ఈ ఆరోపణలు 2021 అబుదాబి T10 క్రికెట్ లీగ్‌కు సంబంధించినవి.

**మాజీ ఆల్ రౌండర్‌పై చర్యలు..**

ఆగస్టు 15, శుక్రవారం నాడు ఐసీసీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఈ నిషేధం సెప్టెంబర్ 13, 2023



నుంచి అమలులోకి వస్తుంది. ఆ రోజు సమన్ తాత్కాలికంగా సస్పెండ్ చేయబడ్డాడు. "పూర్తి విచారణ తర్వాత, ట్రిబ్యునల్ సమన్‌ను ఆర్టికల్ 2.1.1 కింద దోషిగా నిర్ధారించింది. ఇది 'అబుదాబి T10 2021లో మ్యాచ్‌ల ఫలితాన్ని లేదా మ్యాచ్‌లను ఫిక్సింగ్ చేయడానికి లేదా అనుచితంగా ప్రభావితం చేయడానికి ప్రయత్నించడంలో పాల్గొనడం' అని పేర్కొంది. దీని అర్థం అతను మ్యాచ్‌లను ఫిక్సింగ్ చేయడానికి ప్రయత్నించాడని తెలిపింది.దీంతో పాటు, 'కోడ్ ప్రకారం అవినీతికి పాల్పడినందుకు బదులుగా మరొక ఆటగాడికి బహుమతిని అందించడం' అనే ఆర్టికల్ 2.1.3 కింద, 'ఏ ఆటగాడిని అయినా ఉద్దేశపూర్వకంగా ప్రేరేపించడం, ప్రలోభపెట్టడం, సూచించడం, ఒప్పించడం, ప్రోత్సహించడం లేదా సులభతరం చేయడం, ప్రత్యక్షంగా లేదా తప్పుగా, కోడ్ ఆర్టికల్ 2.1 ఉల్లంఘనకు పాల్పడేలా చేయడం' గురించి మాట్లాడే ఆర్టికల్ 2.1.4 కింద కూడా సమన్లు జారీ చేశామని ఐసీసీ తెలిపింది.

టోర్నమెంట్‌లో తప్పుడు కార్యకలాపాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పూణే డెవిల్స్ ఫ్రాంచైజీ సహ యజమానులు క్రిషన్ కుమార్ చౌదరి, పరాగ్ సంఘ్వి, బంగ్లాదేశ్ ఆల్ రౌండర్ నాసిర్ హుస్సేన్, దేశీయ ఆటగాడు రిజ్వాన్ జావేద్, బ్యాటింగ్ కోచ్ అషర్ జైదీ, అసిస్టెంట్ కోచ్ సన్నీ ధిల్లాన్, జట్టు మేనేజర్ షాదాబ్ అహ్మద్‌లకు సమన్లు జారీ చేసిన సమయంలో ఈ సంఘటన జరిగింది.

**సాలియా సమన్ దేశీయ గణాంకాలు..**

సాలియా సమన్ దేశీయ గణాంకాల గురించి మాట్లాడితే 101 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 27.95 సగటుతో 3622 పరుగులు చేశాడు. అత్యుత్తమ స్కోరు 129 పరుగులు కాగా, 25.92 సగటుతో 271 వికెట్లు తీశాడు. 77 లిస్ట్ ఎ మ్యాచ్‌ల్లో 898 పరుగులు చేశాడు. అక్కడ అత్యుత్తమ స్కోరు 65 పరుగులు. ఫస్ట్ క్లాస్‌లో 27.63 సగటుతో 84 వికెట్లు తీసింది. 47 టీ20 మ్యాచ్‌ల్లో, సమన్ 129.92 స్ట్రైక్ రేట్‌తో 678 పరుగులు చేశాడు. ఇక్కడ అత్యుత్తమ స్కోరు 78 నాటౌట్. 18.68 సగటుతో 58 వికెట్లు తీశాడు.

## అండర్-19 ప్రపంచకప్‌లో అమెరికా




**దుబాయ్**


జింబాబ్వే, నమీబియా వేదికలుగా వచ్చే ఏడాది జరిగే ప్రతిష్టాత్మక అండర్-19 ప్రపంచకప్ టోర్నీకి అమెరికా జట్టు అర్హత సాధించింది. తద్వారా మెగాటోర్నీకి బెర్తు దక్కించుకున్న 16వ జట్టుగా అమెరికా నిలిచింది. రీజినల్ క్వాలిఫికేషన్‌లో భాగంగా రౌండ్‌రాబిన్ ఫార్మాట్‌లో జరిగిన టోర్నీలో కెనడా, బెర్ముడా, అర్జెంటీనాపై అమెరికా విజయాలు సాధించింది.కెనడాపై 65 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన అమెరికా బెర్ముడా, అర్జెంటీనాను చిత్తుచేసి 10 పాయింట్లతో గ్రూపులో అగ్రస్థానంలో నిలిచింది. టాపార్డర్ బ్యాటర్ అమరిందర్‌సింగ్ 199 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలువగా, అన్శరాయ్, సాహిర్ భాటియా ఏడేసి వికెట్లతో జట్టు విజయాల్లో కీలకమయ్యారు. 2024 ప్రపంచకప్‌లో టాప్-10లో నిలిచిన జట్లు నేరుగా అర్హత సాధించగా, మిగిలిన ఆరు జట్లు రీజినల్ టోర్నీల ద్వారా బెర్తులు సొంతం చేసుకున్నాయి. ఆతిథ్య దక్షిణాఫ్రికా, జింబాబ్వే సహా భారత్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, ఐర్లాండ్, పాకిస్థాన్, న్యూజిలాండ్, శ్రీలంక, వెస్టిండీస్, అమెరికా, టాంజానియా, అఫ్ఘనిస్థాన్, జపాన్, స్కాట్లాండ్ అర్హత సాధించాయి.

## మ్యాక్స్‌వెల్ ధమాకా..


### దక్షిణాఫ్రికాపై ఆసీస్ ఉత్కంఠ విజయం

**కెర్న్స్(ఆస్ట్రేలియా)**

దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-1తో కైవసం చేసుకుంది. శనివారం జరిగిన నిర్ణయాత్మక మూడో టీ20 పోరులో ఆసీస్ 2 వికెట్ల తేడాతో సఫారీలపై ఉత్కంఠ విజయం సాధించింది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 173 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ 19.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. చివరి రెండు బంతుల్లో విజయానికి నాలుగు పరుగులు అవసరమైన దశలో ఎంగ్డీ వేసిన బంతిని రివర్స్ స్వీప్ చేస్తూ



మ్యాక్స్‌వెల్..ఆసీస్‌కు అద్భుత విజయాన్ని కట్టబెట్టాడు.సహచరులు విఫలమైన వేళ తాను ఉన్నానంటూ ఇన్నింగ్స్ భారాన్ని మోస్తూ మ్యాక్స్‌వెల్(36 బంతుల్లో 62 నాటౌట్, 8ఫోర్లు, 2సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీకి తోడు కెప్టెన్ మిచెల్ మార్ష్(54) సమయోచిత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. కార్బిన్ బాచ్(3/26), రబాడ(2/32), మఫాకా(2/36) ధాటికి ఆసీస్ ఒక దశలో 122 పరుగులకే 6 కీలక వికెట్లు కోల్పోయింది. ఈ దశలో మ్యాక్స్‌వెల్ ఆఖరి వరుస బ్యాటర్లతో కలిసి జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు. తొలుత దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 172/7 స్కోరు చేసింది



## ఏంటీ బ్యూటీ డల్‌గా ఉన్నావు..
## ఆలోచనలో పడిపోయిన భాగ్యశ్రీ బోర్సే!

అందాల ముద్దుగుమ్మ భాగ్య శ్రీ బోర్సే గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ అమ్మడు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చి చాలా తక్కువ సమయమే అయినప్పటికీ యూత్‌లో మాత్రం మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ మధ్య ఎవరినోట విన్నా ఈ అమ్మడు పేరే వినిపిస్తుంది. అంతలా తన అందంతో అందరినీ మాయ చేసింది ఈ బ్యూటీ.భాగ్య శ్రీ బోర్సే మాస్ మహారాజ్ రవితేజ సరసన మిస్టర్ బచ్చన్ మూవీలో నటించి మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ మూవీలో ఈ అమ్మడు నటన, గ్లామర్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. దీంతో ఆ మూవీ రిలీజైనప్పటి నుంచి ఈ బ్యూటీ యూత్ లేటెస్ట్ క్రష్ అయిపోయింది. ఇక మూవీ విడుదలై అభిమానులను నిరాశ పరిచినప్పటికీ ఈ అమ్మడుకు మాత్రం విపరీతమైన క్రేజ్ వచ్చింది.దీంతో ఈ బ్యూటీ వరసగా ఆఫర్స్ అందుకుంటూ దూసుకెళ్తున్నట్లు టాక్ వినిపిస్తుంది. ఇక ఈ మధ్య విజయ్ దేవరకొండ సరసన, కింగ్ డమ్ మూవీలో కనిపించి మెప్పించింది. కానీ ఈ మూవీలో ఈ బ్యూటీరోల్ అంతగా లేకపోవడంతో ఈఅమ్మడుకు ఇది అంతగా కలిసిరాలేదనే చెప్పాలి.ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ ఎప్పుడూ తన ఫొటోస్ షేర్ చేస్తూ కుర్రకారును మాయ చేస్తుంటుంది. ఈ క్రమంలోనే ఈ అమ్మడు తాజాగా, చాలా డల్‌గా, ఏదో ఆలోచిస్తున్నట్లు కూర్చున్న ఫొటోస్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. అందులో ఈ అమ్మడును చూసిన వారందరూ షాక్ అవుతున్నారు.దీంతో ఏంటీ బ్యూటీ చాలా డల్ అయ్యావు.. ఏం ఆలోచిస్తున్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. మరీ మీరు కూడా ఈ ఫొటోస్ పై ఓ లుక్ వేయండి.

## బ్లాక్ కలర్ చీరలో కుర్రాళ్లకు చమట్లు పాటిస్తున్న అన్షు

మొదటి సినిమాతోనే అడియన్స్ హృదయాల్లో స్థానం సంపాదించుకుంది అన్షు. నాగార్జున నటించిన మన్మథుడు సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది. ఈ చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా ఫిల్మ్ ఫేర్ అవార్డ్ అందుకుంది. మన్మథుడు సినిమాతో స్టార్ హీరోయిన్ రేంజ్ క్రేజ్ సంపాదించుకున్న అన్షు..ఆ తర్వాత ప్రభాస్ నటించిన రాఘవేంద్ర చిత్రంలోనూ కనిపించింది. ఈ సినిమా కమర్షియల్ గా మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ రెండు సినిమాల్లో అన్షు పాత్ర చనిపోతుంది. ఆ తర్వాత సైతం అలాంటి తరహా పాత్రలే రావడంతో సినిమాలకు దూరంగా ఉండిపోయింది.15 ఏళ్లపాటు సినిమాలకు దూరంగా ఉన్న అన్షు.. ఇటీవలే మజాకా సినిమాతో రీఎంట్రీ ఇచ్చింది. డైరెక్టర్ త్రినాథరావు నక్కిన తెరకెక్కించిన ఈ సినిమాలో సందీప్ కిషన్ హీరోగా నటించగా.. రీతూ వర్మ కథానాయికగా నటించింది. ఇందులో రావు రమేష్, అన్షు కీలకపాత్రలు పోషించారు.సినిమాలకు గుడ్ బై చెప్పిన తర్వాత లండన్ కు చెందిన సచిన్ సగ్గార్ ను వివాహం చేసుకుంది. వీరికి బాబు, పాప ఉన్నారు. ప్రస్తుతం లండన్‌లో ఇన్‌స్పిరేషన్ కౌచర్ అనే డిజైనింగ్ షాప్ నిర్వహిస్తుంది. ఇక ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు సినిమాల్లో రాణించాలని చూస్తుంది.కాగా సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది తాజాగా కొన్ని ఫోటోలను పంచుకుంది. ఈ ఫొటోల్లో తన అందంతో కవ్వించింది అన్షు. వయసు పెరిగినా ఈ బ్యూటీ అందం మాత్రం తగ్గడం లేదు అని కామెంట్స్ చేస్తున్నారు కుర్రాళ్ళు. బ్లాక్ కలర్ చీరలో అదరగొట్టింది ఈ అమ్మడు.





### మరోసారి అ స్టార్ హీరోతో
## రొమాన్స్‌కు రెడీ అంటున్న పూజాహెగ్డే

అందాల భామ పూజా హెగ్డే కు ప్రస్తుతం బ్యాడ్ టైం నడుస్తుంది. ఈ ముద్దుగుమ్మ నటించిన సినిమాలనే బాక్సాఫీస్ దగ్గర బోల్తాకొడుతున్నాయి. పాన్ ఇండియా రేంజ్ లో సినిమాలు చేస్తున్నా ఈ భామకు మాత్రం హిట్స్ అందుకోలేకపోతుంది. 2020లో వచ్చిన అల వైకుంఠపురములో సినిమా తర్వాత పూజా హెగ్డే సరైన హిట్ అందుకోలేకపోయింది. ఆ తర్వాత పూజా చేసిన సినిమాలన్నీ డిజాస్టర్ గా మారాయి. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో సినిమాలు చేసినా కూడా ఫలితం లేకపోయింది.. చేసిన సినిమాలన్నీ ఫ్లాప్ అవ్వడంతో పూజకు ఆఫర్స్ తగ్గాయి. చిన్న గ్యాప్ తీసుకున్న ఈ బ్యూటీ ఇప్పుడు వరుసగా సినిమాలు చేస్తుంది. కానీ హిట్స్ మాత్రం అందుకోలేకపోతుంది. అయితే తాజాగా పూజా చేసిన కామెంట్స్ వైరల్ గా మారాయి. ఓ స్టార్ హీరోతో కలిసి నటించడానికి తాను ఎప్పుడూ సిద్ధం అని తెలిపింది. ఇంతకూ ఆ హీరో ఎవరో తెలుసా? పూజా హెగ్డే టాలీవుడ్ టాప్ హీరోలందరి సరసన నటించింది. మహేష్ బాబుతో మహర్షి, ప్రభాస్ తో రాధేశ్యామ్, రామ్ చరణ్ తో ఆచార్య, ఎన్టీఆర్ సరసన 'అరవింద సమేత', అల్లు అర్జున్ తో అలా వైకుంఠపురంలో సినిమాలు చేసి మెప్పించింది. అలాగే తమిళ్ లో స్టార్ హీరోలతో అదేవిధంగా బాలీవుడ్ లో బడా హీరోలతో కలిసి నటించింది. అయితే తాను ప్రభాస్ తో నటించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉన్నాను అని తెలిపింది.

## వివేక్ అగ్నిహోత్రి 'ది బెంగాల్ ఫైల్స్' ట్రైలర్ రిలీజ్




'ది కశ్మీర్ ఫైల్స్', 'ది తాష్కెంట్ ఫైల్స్' వంటి వివాదాస్పద చిత్రాలతో గుర్తింపు పొందిన దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం ది బెంగాల్ ఫైల్స్ . ఈ సినిమాను అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 5 2025న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రయూనిట్ మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది. అభిషేక్ అగర్వాల్, పల్లవి జోషి సహనిర్మాతలుగా వ్యవహరించిన ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, పల్లవి జోషి, గోవింద్ నామ్‌దేవ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటించారు.

## విజయ్ దేవరకొండతో రొమాంటిక్ పిక్ షేర్ చేస్తూ.. నమ్మలేకపోతున్నానంటూ రష్మిక కామెంట్



టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్నా మధ్య ఉన్న బంధం గురించి చాలా కాలంగా పుకార్లు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ జంట ఎప్పుడూ తమ వ్యక్తిగత జీవితంపై స్పష్టత ఇవ్వకుండా, నచ్చినట్లు తిరుగుతూ మీడియాలో హాట్ టాపిక్ అవుతున్నారు. ఆగస్టు 15న రష్మిక షేర్ చేసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ మాత్రం వీరి మధ్య ఉన్న కెమిస్ట్రీని తారా స్థాయికి తీసుకెళ్లింది. రష్మిక తన సోషల్ మీడియా ఖాతాలో విజయ్ దేవరకొండతో కలిసి దిగిన పలు ఫొటోలు షేర్ చేసింది. వీటిలో ఓ ఫోటో మాత్రం రొమాంటిక్ కోణాన్ని ఆవిష్కరిస్తుంది.ఈ పిక్ సడెన్‌గా చూసిన వారంతా వీళ్లిద్దరూ తమ రిలేషన్‌షిప్‌ను ప్రకటించేశారా? అనే సందేహంలో పడ్డారు. అయితే వాస్తవం ఏంటంటే, ఈ పిక్స్ 2018లో విడుదలైన 'గీత గోవిందం' సినిమా షూటింగ్ టైమ్‌లో తీసిన ఫొటోలే. ఈ మూవీకి ఏడేళ్లు పూర్తైన సందర్భంలో రష్మిక ఈ మధుర జ్ఞాపకాలను అభిమానులతో పంచుకుంది. ఆమె తన పోస్ట్‌లో "ఈ ఫొటోలు నా దగ్గర ఇప్పటికీ ఉన్నాయన్న విషయాన్ని నమ్మలేకపోతున్నాను. 'గీత గోవిందం' నా జీవితంలో చాలా ప్రత్యేకమైన సినిమా. 7 సంవత్సరాలు ఎలా గడిచాయో అర్థం కావట్లేదు," అంటూ భావోద్వేగంతో రాసింది. ఈ ఫొటోలు చూస్తూ నెటిజన్లు మాత్రం మరో కోణంలో కామెంట్లు పెడుతున్నారు. "విజయ్-రష్మిక లవ్ ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది", "మీ పెళ్లి కోసం ఎదురు చూస్తున్నాం", "ఫస్ట్ ఫోటో చూసే షాక్ అయ్యా" వంటి కామెంట్లు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. మరోవైపు 'గీత గోవిందం' అభిమానులు మాత్రం ఈ జంటను మళ్లీ స్క్రీన్‌పై చూడాలంటూ కోరుతున్నారు. గీత గోవిందం తర్వాత డియర్ కామ్రేడ్ అనే చిత్రంలో ఈ ఇద్దరు కలిసి నటించారు. గీత గోవిందం పెద్ద హిట్ కాగా, డియర్ కామ్రేడ్ మాత్రం అంతగా అలరించలేకపోయింది.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492